RNI Reg-No. APTEL/2005/15854

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Visakhapatnam, Vijayawada, Tirupati & Hyderabad

Website : https://netimanadesam.com/

సంపుటి : 21 సంచిక : 61 విశాఖపట్నం సంపాదకులు : కె.ఎస్.రంగశాయి మంగళవారం14-04-2026 పేజీలు :8 వెల : రూ.1-00



## నెలాఖరులోగా
# డీ-రెగ్యులేషన్ ఫేజ్-2

- దరఖాస్తు నుంచి అనుమతుల వరకు ఆన్‌లైన్
- కేంద్ర కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ బృందంతో సీఎం సమీక్ష



**అమరావతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** మే నెలాఖరులోగా డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు అన్నారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకు వివరాలన్నీ ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై చర్చించారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం, అనుమతుల సులభతరంపై మాట్లాడారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సందీప్ పౌండ్రిక్.. ముఖ్యమంత్రి ఎదుట ఉంచారు. ఈ ప్రతిపాదనలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్షించారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనల్లో రాష్ట్రం చాలా ముందుందని సందీప్ పౌండ్రిక్ చెప్పగా.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానం అవలంబిస్తున్నట్లు వెల్లడించారు. డీ-రెగ్యులేషన్ ఫేజ్-3 చేపడుతున్నారా? అని సందీప్ పౌండ్రిక్‌ను సీఎం అడిగారు. జూన్ నెల నుంచి ఫేజ్-3పై పని చేస్తామని ఆయన తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్దపీట వేయాలని సీఎం కోరారు.ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు తీసుకురావాలని చంద్రబాబు సూచించారు. ప్రజల భద్రత, పర్యావరణం విషయంలో రాజీపడొద్దన్నారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

తరువాయి 2లో..

# మహిళా రిజర్వేషన్ బిల్లు..
## 21వ శతాబ్దపు నిర్ణయాల్లో కీలకమైనది : మోడీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 :** చట్టసభలల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెచ్చిన 'నారీ శక్తి వందన్ అధియాన్'ను అమలు చేసేందుకు తీసుకున్న నిర్ణయం 21వ శతాబ్దపు భారత్ తీసుకున్న అతిపెద్ద నిర్ణయాలలో ఒకటని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. నేడు న్యూఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి ప్రస్థానంలో ఈ కీలక ఘట్టాల నడుమ భారతదేశం 21వ శతాబ్దపు అతిపెద్ద నిర్ణయాలలో ఒకదాన్ని తీసుకోబోతోంది. 21వ శతాబ్దపు ముఖ్యమైన నిర్ణయాలలో ఇది కూడా ఒక ముఖ్యమైన నిర్ణయం అని చెబుతున్నాను. ఈ నిర్ణయం నారీశక్తికి అంకితం చేయబడింది. గత దార్శనికతను వాస్తవ రూపంలోకి తీసుకొచ్చే, అలాగే సామాజిక న్యాయం, పరిపాలన, నిర్ణయాలలో కీలక భాగంగా మార్చే ఒక చర్యగా ప్రధాని మోడీ దీనిని అభివర్ణించారు. ఈ నిర్ణయం మహిళా శక్తికి, మహిళా శక్తి గౌరవానికి అంకితం చేయబడింది. మన దేశ పార్లమెంటు

తరువాయి 2లో..

# రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఏపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు. అమరావతి రాజధాని ప్రజల కల అన్నారు. ఇందుకోసం రైతులు 33 వేల ఎకరాలు ఉదారంగా ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని వివరించారు.

# శవరాజకీయాలుల్లో జగన్ దిట్ట

- తండ్రి చనిపోతే సిఎం కోసం పైరవీలు - మంత్రి అచ్చన్నాయుడు విమర్శలు



**అమరావతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** శవరాజకీయలు నెరపడంలో జగన్ దిట్ట అని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ తన తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం సంతకాలు సేకరించిన ఘనుడని సెటైర్లు గుప్పించారు. ఆయన శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి చరిత్ర ఈ రాష్ట్రానికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ఆనాడు జగన్‌కు ఉన్న అధికార దాహం చూసే, ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి వైసీపీ అడ్రస్ గల్లంతు చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. జనం ఆయనను ఛీత్కరించుకున్నా.. ఇంకా సిగ్గు లేకుండా అమరావతిపై అబద్దాలు, మావిగన్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారా..? అని ధ్వజ మెత్తారు. అమరావతిని అక్షయపాత్రగా మార్చి తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. జగన్ అండ్ కో అవినీతికి అది కామధేనువులా కనిపించడం మీ దిగజారుడుతనానికి నిదర్శన మని విమర్శించారు. ప్రజలు పెట్టిన వాత ఇంకా పచ్చిగానే ఉందని, అది మర్చిపోయి మాట్లాడితే మళ్లీ అదే గతి పడుతుందని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.



## బాంబులు..తూటాలకు ఓట్లతో సమాధానమిస్తారు: అమిత్ షా

**బెంగాల్, ఏప్రిల్ 13 :** త్వరలో జరగనున్న ఎన్నికల్లో బెంగాల్ ప్రజలు బాంబులు, తూటాలకు ఓట్లతో జవాబు ఇస్తారని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మమత ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారని.. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది భాజపానేనని అన్నారు. పోలింగ్ రోజు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా టీఎంసీ గూండాలు తమ ఇళ్లలోనే ఉండాలని.. లేదంటే ఫలితం వెలువడిన అనంతరం వారిని కటకటాల వెనక్కి పంపుతామని హెచ్చరించారు. బెంగాల్‌లోని రాణిగంజ్ ప్రాంతంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో

తరువాయి 2లో..


## రాజమండ్రి జైలుకు.. ఉగ్రలింకుల కేసు నిందితులు




వార్త.. 2 లో

# పీజీఆర్ఎస్ వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ - పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లకు 334 వినతులు అందజేత



**విశాఖపట్నం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** పీజీఆర్ఎస్ వేదికగా ప్రజల నుంచి వచ్చిన వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, సంతృప్తికర రీతిలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ మీటింగ్ హాలులో నిర్వహించిన పీజీఆర్ఎస్ సమీక్షలో ఆయన అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా చదివి చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారుతో సంబంధిత అధికారులు నేరుగా మాట్లాడాలని సూచించారు. అనంతరం...

ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు చెప్పిన సమస్యలను సావధానంగా విన్నారు. చర్యలపై సంబంధిత అధికారులకు తగిన విధంగా ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 334 వినతులు నమోదయ్యాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 59, జీవీఎంసీకు చెందినవి 83, పోలీస్ శాఖకు చెందినవి 23, ఇతర శాఖలకు చెందినవి 169 వినతులు ఉన్నాయి. పీజీఆర్ఎస్ లో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఏడీసీ సత్యవేణి ప్రజల నుంచి వినతులు స్వీకరించగా, రెవెన్యూ క్లినిక్ లో ఆర్డీవోలు, తహశీల్దార్లు ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు.

## పోలీసు కస్టడీకి
# దేవాదాయ-శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి



**విజయవాడ, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిని న్యాయస్థానం కస్టడీకి పంపుతూ ఆదేశాలు జారీచేసింది. ఆమెను ఈ నెల 15, 16 తేదీల్లో విచారించేందుకు ఏసీబీ కోర్టు అనుమతినిచ్చింది. ప్రస్తుతం ఆమె విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. రెండున్నరేళ్ల కుమారుడు ఉన్నందున ములాఖత్‌కు అనుమతించాలని శాంతి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ పూర్తి చేసిన కోర్టు.. తీర్పును ఏప్రిల్ 16కి వాయిదా వేసింది. ఈ నెల 7న తాడేపల్లి, ఉండవల్లి సహా 4 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టిన అవినీతి నిరోధకశాఖ అధికారులు భారీగా అక్రమ ఆస్తులను గుర్తించారు. విశాఖ ఎండాడలో లగ్జరీ ఫ్లాట్, తాడేపల్లి కుంచనపల్లిలో జీ+2 భవనంతోపాటు 770 గ్రాముల బంగారు నగలు, 3 కిలోల వెండి గుర్తించారు. అంతేకాకుండా రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో మరో రూ.3 లక్షలు ఉన్నట్లు తేల్చారు. వీటితోపాటు ఓ కారు, ద్విచక్ర వాహనాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే.

మొదటిపేజీ తరువాయి...

## మహిళా రిజర్వేషన్ బిల్లు..

ఒక కొత్త చరిత్రను సృష్టించేందుకు దగ్గరలో ఉంది. గత భావనలను సాకారం చేసే ఒక కొత్త చరిత్ర అది. భవిష్యత్తు తీర్మానాలను నెరవేర్చేది. ఇది సమానత్వంతో కూడిన భారతదేశం కోసం ఒక తీర్మానం. ఇక్కడ సామాజిక న్యాయం కేవలం ఒక నినాదంగా కాకుండా మన పని సంస్కృతిలో, మన నిర్ణయ ప్రక్రియలో ఒక సహజ భాగంగా ఉంటుంది. రాష్ట్ర శాసనసభల నుండి దేశ పార్లమెంటు వరకు దశాబ్దాల నిరీక్షణకు తెరదించే సమయం ఆసన్నమైంది. అది ఏప్రిల్ 16,17,18 తేదీలు. ప్రజాస్వామ్య వ్యవస్థలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలనే ఆవశ్యకతను దశాబ్దాలుగా ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. ఈ చర్చ దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతుంది. ఇందులో అన్ని పార్టీల, అనేక తరాల కృషి ఉంది. ప్రతి పార్టీ ఈ ఆలోచనను తనదైన రీతిలో ముందుకు తీసుకెళ్లింది. 2029 నాటికి మహిళా సాధికారత చట్టాన్ని అమలు చేయాలన్నది ఏకగ్రీవ డిమాండ్. ఈ అంశంపై ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటు సమగ్ర చర్చలు జరుపు తుంది. దీన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని పార్టీలు కలిసి పనిచేస్తాయి' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి పార్టీ రాజకీయాలకు అతీతంగా మహిళల ప్రయోజనం కోసం ఈ ముఖ్యమైన పనిని చేపట్టినందుకు దేశంలోని ప్రతి మహిళ కూడా సంతోషిస్తుంది అని మోడీ అన్నారు.

## నెలాఖరులోగా డీ-రెగ్యులేషన్ ఫేజ్-2

అటవీ చట్టాలను సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచించారు. ఫైర్ సేఫ్టీపై నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనల విషయంలో పలు సూచనలు చేశారు. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలన్నారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవితకాలం చెల్లుబాటు అయ్యేలా నిబంధనలు సవరించాలన్నారు. స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్షించారు. పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని సీఎం చంద్రబాబు మార్గ నిర్దేశర చేశారు. ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలని దిశానిర్దేశం చేశారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని సూచించారు. మే నెలాఖరులోగా డీరెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలని.. ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకు రావాలని దిశానిర్దేశర చేశారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం పక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఫేజ్-2 అమలు తర్వాత పరిశ్రమల అనుమతుల ఏర్పాటుకు ఇప్పుడున్న పక్రియలో 40 శాతం మేర సమయం తగ్గాలని సూచించారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే ఏపీ చాలా ముందుందని కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ తెలిపారు. ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంబిస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు.

## బాంబులు..తూటాలకు ఓట్లతో సమాధానమిస్తారు: అమిత్ షా

మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో నక్సలిజాన్ని మోదీ ప్రభుత్వం పూర్తిగా అణచివేసిందని.. ఇప్పుడు చొరబాటుదారులను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని అమిత్‌షా అన్నారు. బెంగాల్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి చొరబాటుదారులను బయటకు పంపిస్తామన్నారు. గతంలో మమతా బెనర్జీ మద్దతిచ్చిన మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఉగ్రవాదంపై ఎన్నడూ చర్యలు తీసుకోలేదని.. దానికి బదులుగా ఉగ్రవాదులకు బిర్యానీతో విందు ఇచ్చిందని ఆరోపించారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పహల్గాం దాడులకు ప్రతీకారంగా పాక్‌లోని ఉగ్రవాదులను కోలు కోలేని దెబ్బకొట్టిందన్నారు. రాత్రి సమయాల్లో మహిళలు బయట తిరగాల్సిన అవసరం ఏముందని ఒకప్పుడు మమత ప్రశ్నించారని అమిత్ షా పేర్కొన్నారు. అటువంటి మాటలు ఆమె పదవికే సిగ్గుచేటని అన్నారు. అర్ధరాత్రి కూడా మహిళలు ధైర్యంగా తిరిగే వాతావరణాన్ని తాము బెంగాల్‌లో సృష్టిస్తామన్నారు. ఆర్జీకర్ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటా మన్నారు.

## లోక్‌సభకు సభ్యులందరూ హాజరావ్వాలి

### విప్ జారీ చేసిన కాంగ్రెస్

సోమవారం విప్ జారీ చేసింది. లోక్‌సభలోని కాంగ్రెస్ పార్టీ సభ్యులందరూ గురు, శుక్ర, శనివారాలు అనగా 2026 ఏప్రిల్ 16,17,18 తేదీలలో జరిగే సభకు హాజరవ్వాలి. 16వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సభ వాయిదా పడేవరకు తప్పనిసరిగా సభకు హాజరై పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది. దీనిని అత్యంత ముఖ్యమైనదిగా పరిగణించాలని పార్టీ జారీ చేసిన విప్‌లో పేర్కొంది.

### రాజమండ్రి జైలుకు..

## ఉగ్రలింకుల కేసు నిందితులు

**విజయవాడ, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** ఉగ్రలింకుల కేసులో అరెస్టయిన నిందితుల కస్టడీ ముగిసింది. ఐదు రోజులపాటు నిందితులను కస్టడీకి తీసుకొని పోలీసులు ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో ఉగ్రవాద భావజాల వ్యాప్తిపై వివిధ కోణాల్లో ప్రశ్నించారు. బెన్ఎక్స్.కామ్, దేశవ్యాప్త ఉగ్ర నెట్‌వర్క్ విస్తరణ యత్నాలపై ప్రశ్నలు సంధించారు. కస్టడీ అనంతరం ఆరుగురు నిందితులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా.. ఈ నెల 20 వరకు రిమాండ్ విధించింది. దీంతో నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

## ఐటి ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి

**- ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు ఉండరాదు**

**- ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్న బండి సంజయ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 13 :** నాసిక్‌లో జరిగిన 'లవ్ జిహాద్' ఆరోపణల కేసు నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ మేరకు బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులపై మత పరమైన ఒత్తిళ్లు, వేధింపులు, రహస్య నెట్‌వర్క్‌ల ప్రభావం ఉండకూడదని తెలిపారు. హైదరాబాద్‌లో లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు ఉన్నందున వారి పని వాతావరణం కేవలం కెరీర్ అభివృద్ధికి మాత్రమే పరిమితం కావాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వానికి బండి సంజయ్ కొన్ని కీలక సూచనలు చేశారు. అన్ని ప్రధాన ఐటీ కంపెనీల హెచ్‌ఆర్ బృందాలతో తక్షణ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల భద్రతపై స్పష్టమైన విధానాలు రూపొందించాలని అన్నారు. ఉద్యోగుల ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ కేసును కూడా దాచిపెట్టకూడదని చెప్పు కొచ్చారు. ఉద్యోగులు కార్యాలయాల్లో స్వేచ్ఛగా, భద్రతతో పనిచేసే వాతావరణం ఉండాలని బండి సంజయ్ కుమార్ సూచించారు. ఏ రకమైన ఒత్తిడి, వేధింపులు, దోపిడీకి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అలాగే, బాధితులు ఒంటరిగా ఉండకుండా వారికి తగిన రక్షణ, మద్దతు అందించాలని సూచించారు. పలువురు ఉద్యోగులు ఇప్పటికే కార్యాలయాల్లో జరిగిన అనుభవాలను సోషల్ మీడియాలో పంచు కుంటున్నారని పేర్కొన్నారు. ఈ హెచ్చరిక సంకేతాలను ప్రభుత్వం, కంపెనీలు నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు.

ఐటీ కంపెనీల యాజమాన్యాలు, హెచ్‌ఆర్ విభాగాలు ఉద్యోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ కుమార్ కోరారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా, వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

## శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రైలు

### హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన రామ్మోహన్ నాయుడు





**శ్రీకాకుళం, ఏప్రిల్13 (నేటి మనదేశమ్) :** శ్రీకాకుళం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా మొదటి రెగ్యులర్ రైలు ప్రారంభమైది. హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. రూ.35 కోట్లతో శ్రీకాకుళం రైల్వేస్టేషన్ అభివృద్ధి చేశామని రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరిందంటూ ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల జిల్లా చరిత్రలో తొలిసారిగా శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీస్ ప్రారంభమైందని తెలిపారు. త్వరలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పూర్తవుతుందని తెలిపారు. ఇక హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి ప్రతి సోమవారం, తిరుపతి నుంచి ప్రతి ఆదివారం అందుబాటులో ఉంటుంది. గతంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైలు నడపాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరారు. వెంటనే స్పందించిన రైల్వేమంత్రి ఈ ప్రతిపాదనలపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెగ్యులర్ రైలును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈక్రమంలో తాజాగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి రైలు నంబర్ 17439/40 హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ఈ హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి బయల్దేరుతుంది.. అలాగే ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్డు నుంచి బయల్దేరుతుంది.

## తూర్పు జోన్ లో ఏప్రిల్ 16న బహిరంగ వేలం



**విశాఖపట్నం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ తూర్పు జోన్ పరిధిలో ఖాళీగా వున్న షాపు రూములు, కళ్యాణ మండపములు, ఖాళీ స్థలం లకు ఏప్రిల్ 16న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించబడునని తూర్పు జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ సోమవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.తూర్పు జోన్ పరిధిలో గల ఖాళీగా వున్న షాపు రూములు, కళ్యాణ మండపములు, ఖాళీ స్థలం లకు 3 సంవత్సరముల కాలమునకు గుత్తలకు ఇచ్చుటకు గాను తేది: 16-04-2026 న ఉదయం 11 గంటలకు తూర్పు జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని, ఆసక్తి గల పాటదారులు పూర్తి వివరాలకు తూర్పు జోనల్ కమిషనర్ కార్యాలయం లోని పని వేళలో కార్యలయ పర్యవేక్షకులను సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

## ఆస్తిపన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ

### నెలఖారు వరకు గడువు పొడిగింపు

**అమరావతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** పట్టణ ప్రాంతాల్లో ఆస్తిపన్ను బకాయిలపై ఆస్తిపన్ను బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 31 మార్చి 2026 నాటికి ఉన్న బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఈ గడువును ఈ నెలాఖరు వరకు పొగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ రాయితీని పొందాలంటే బకాయి మొత్తం పూర్తిగా చెల్లించి, మిగిలిన 50 శాతం వడ్డీని ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆస్తిపన్ను చెల్లించని వారికి గోల్డెన్ ఛాన్స్ అని చెప్పుకోవాలి. సీడీఎమ్ఏ కమిషనర్ సంపత్ కుమార్ సూచనల మేరకు.. ఈ రాయితీ అమలు ఏప్రిల్ 30 వరకు మాత్రమే అమల్లో ఉండనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై మాత్రమే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వెంటనే వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఏప్రిల్ 30, 2026 లోపు ముందస్తుగా మొత్తం చెల్లించేవారికి 5 శాతం అదనపు రాయితీ కూడా లభిస్తుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలోనూ రాయితీ అమలులో ఉండనుంది. పట్టణాభివృద్ధికి పన్నులు చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీప మున్సిపల్ కార్యాలయం, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆస్తి పన్ను చెల్లించి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

### వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు మరోమారు పిటిషన్ దాఖలు చేసిన సునీత

**హైదరాబాద్, ఏప్రిల్ 13 :** మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తును కొనసాగించేలా కేంద్ర దర్యాప్తు సంస్థకు ఆదేశాలు ఇవ్వాలంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను వివేకా కూతురు సునీతా రెడ్డి దాఖలు చేశారు. ఈ కేసులో కొన్ని కోణాలపై సీబీఐ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయలేదని, పలు అనుమానాలకు సమాధానాలు రాలేదని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువల్ల మరింత సమగ్ర తదుపరి దర్యాప్తు జరపాలని హైకోర్టును కోరారు. ఈ కేసు ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తులో ఉంది. గతంలో సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం కొన్ని వ్యక్తుల మధ్య జరిగిన ఫోన్ కాల్ డేటా సహా పలు సాంకేతిక ఆధారాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టింది.

## స్వీయ గణనపై విస్తృత అవగాహన కల్పించాలి

### జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, ఏప్రిల్ 13 (నేటి మన దేశమ్) :** రాబోయే సెన్సస్-2027 ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానంపై జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రజలే స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే ఈ వినూత్న అవకాశాన్ని ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30, 2026 వరకు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల పౌరులు నిర్ణీత గడువులోగా https://se.census.gov.in అనే పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున 15 రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, ముఖ్యంగా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు మరియు కార్మికులను భాగస్వాములను చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి గ్రామం మరియు వార్డు సచివాలయ సిబ్బంది రోజుకు కనీసం 10 నుండి 20 మందికి ఈ స్వీయ గణనలో చేదోడువాదోడుగా నిలవాలని ఆయన సూచించారు. అదేవిధంగా, సమాజంలోని ప్రముఖ వ్యక్తులు మరియు ప్రజా ప్రతినిధులు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అయితే, ఈ స్వీయ గణన ప్రక్రియ పూర్తిగా స్వచ్ఛందమని, ఎవరిపైనా ఎటువంటి ఒత్తిడి లేదా బలవంతం చేయరాదని ఆయన స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తు ప్రణాళికలకు ఆధారమైన ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారంలో చొరవ చూపిన అధికారులకు గుర్తింపు

### - జాయింటు కలెక్టర్ సేధు మాధవన్



**విజయనగరం, ఏప్రిల్ 13 (నేటి మన దేశమ్) :** ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించి, చక్కని పనితీరును చూపిన అధికారులకు ప్రభుత్వం నుండి గుర్తింపు ఉంటుందని జాయింటు కలెక్టరు సేధు మాధవన్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్, వివిధ శాఖల అందిస్తున్న సేవలు పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో వస్తున్న అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జాయింటు కలెక్టరు అధికారులను ఆదేశించారు.సమీక్షా సమావేశంలో జాయింటు కలెక్టరు సేధు మాధవన్ మాట్లాడుతూ పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించి, చక్కని పనితీరును చూపిన పది మంది అధికారులకు ప్రభుత్వం నుండి గుర్తింపు లభించినందుకు అభినంది స్తున్నట్లు తెలిపారు. అర్జీల పరిష్కారంలో వారు అనుసరించిన విధానాలను పరిశీలించి, అర్జీ అందిన రోజునే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్జీదారునితో నేరుగా మాట్లాడాలని, సమస్య పరిష్కార విధానం గురించి తెలియజేయాలని, సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను విపులంగా తెలియజేయాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా సరియైన ఎండార్సుమెంటు అందజేయాలని, అర్జీలకు సమాధానశీగా అసంపూర్ణ, సంబంధంలేని ఎండార్స్మెంట్ అందజేయకూడదని ఆదేశించారు.

ప్రి ఆడిట్, ఆడిట్ ప్రక్రియలో అర్జీదారులు సంతృప్తి వ్యక్తంచేసేలా అర్జీల పరిష్కారం ఉండాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం పై పర్యవేక్షణ చేయాలన్నారు. విధిగా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలను తనిఖీ చేయాలని, సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా మరియు వారి విధులను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# నేటి మనదేశమ్ సంపాదకీయం

## అంబేడ్కర్ ఆశయాలకు పట్టం కట్టాలి !

అంబేడ్కర్ మహాశయుడు ఈ దేశం గురించి గొప్పగా కలలు కన్నారు. తన దేశాన్ని ఉన్నతంగా చూడాలను కున్నారు. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, అందరికీ విద్య దక్కాలన్న ఆశయం ఆయనది. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేడ్కర్. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సౌర్వభౌమాధి కారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యంగాన్ని రూపొందించారు. వివిధ రకాల భాషలు, ఆచారాలు, మతాలూ ఉన్నటువంటి ఈ దేశంలో ఆయన ముందు చూపుతో రాసిన రాజ్యాంగం అనుసరించి ఇప్పుడు మన దేశం నడుస్తుంది అంటే ఆయన గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. ఆయన కేవలం దళితుల కోసమో లేక వాళ్ళ రిజర్వేషన్ ల కోసమో మాత్రమే కృషి చేయలేదు. ఆడవాళ్ళకి మగవాళ్ళకి సమానమైన జీతాలు ఉండాలని, ఆడవాళ్ళకి ప్రెగ్నెన్సీ టైం లో లీవ్స్ ఇవ్వాలని, పని గంటల సమయాన్ని 12 నుండి 8 గంటలు చేయాలనీ, స్త్రీలకూ ఆస్తి హక్కు ఇవ్వాలని ఇలా ఎన్నో అంశాలలో ఈయన కృషి చేసారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన ఆశయాలపై ఇప్పటికైనా అధ్యయనం చేయాలి. ఎంతసేపు అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టడం, సభలు పెట్టడం కాదు. ఆయన దేశానికి అందించిన విలువైన సూచనలు పాటించలి. ఆయన కోరుకున్న సమాజం కోసం పాలకులు ఆలోచన చేయాలి. అందుకు నడుం బిగించాలి. జయంతి సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం మానాలి. ఒకానొక సమయంలో అంటరానితనం పేరు తో అట్టడుగు వర్గాల ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉండేదన్నది ఆయన జీవితమే పెద్ద ఉదాహరణ. అప్పటి వరకు మూగ బోయిన అణగారిన ప్రజలకు గొంతుకయ్యాడు. అయితే కొందరు రాజకీయంగా ఆయనను ఎదగకుండా చేశారు. స్వాతంత్ర్యం రాగానే నెహ్రూ బదులు అండేబ్కర్‌ను ప్రధానిని చేసివుంటే మనదేశ రాత మరోలా ఉండేది. కానీ నెహ్రూ, గాంధీల కుట్రలకు ఆయన బలయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్థిక నిపుణుడు, దళితోద్ధారకుడు, మహా మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇలా ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే నేమో ఆయనను ఆనాటి నేతలు దూరం పెట్టారు. ఈనాటి నేతలు విగ్రహాలు పెట్టి, కేవలం చెక్క భజనలు చేస్తున్నారు. కానీ ఆయన స్వప్నించిన భారతాన్ని ఆవిష్కృతం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన రాంజీ మాలోజి సక్పాల్ ,భీమాబాయ్ దంపతులకు మధ్యప్రదేశ్ లోని మావ్ గ్రామంలో మహర్ కులంలో అంబేద్కర్ జన్మించారు. అప్పట్లో ఈ కులం వారిని అంటరానివారిగా పరిగణించేవారు. దళితుడు అనే కారణంతో ఈయన చిన్న వయసు నుండే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. చిన్నప్పుడు వాళ్ళ అన్నయ్యతో కలిసి వేరే ఊరుకి నడిచి వెళ్తుంటే బాగా దాహం వేయడంతో దగ్గరలో ఉన్న ఒక ఇంటికి వెళ్లి తాగడానికి నీటిని అడిగితే అంబేద్కర్ మహర్ కులానికి చెందిన వారు అని తెలిసి నీళ్లు ఇవ్వకపోగా, పక్కనే ఉన్న మురికి గుంటలో నీటిని తాగమని తిట్టి పంపించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి అనేక అవమానాలను అంబేద్కర్ ఎదుర్కొన్నారు. అందుకే ఇలాంటి వ్యవస్తను నిరసించాడు. అలాగని మిగతా కులాల వారిని ఏనాడూ ఆయన ఈసడించుకోలేదు. ఇది వ్యవస్తాగతమైన లోపంగా గుర్తించారు. తన ఆలోచనలను రాజ్యాంగ రచనలో చూపారు. భారత దేశం ఉన్నతంగా ఉండాని కోరుకున్నాడు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. కానీ వారెవ్వరూ అంబేద్కర్‌ను లెక్కచేయలేదంటే, ఆయన పట్ల వారికి గల ప్రేమానురాగాలు ఏపాటివో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికాలో మొదటి సారిగా అంబేద్కర్ స్వేచ్ఛ అంటే ఏంటో చూసారు. అప్పుడు భారత దేశంలో ఉన్నట్టుగా కుల, జాతి వివక్షత లేదు. అందరికి సమానమైన గౌరవం, అవకాశాలు దక్కేవి. 1917 లో అంబేద్కర్ వెనక్కి వచ్చి ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణశాఖలో ఉద్యోగంలో చేరారు.క్కడ ఆయనకి ఒక గొప్ప అధికారిగా ఉద్యోగం దక్కింది కానీ ఈయన నిమ్న కులస్తుడు కావడంతో ఆయన కింద ఉండే ఉద్యోగులు కూడా ఆయనని గౌరవించే వారు కాదు. ఏదైనా ఒక ఫైల్ ఇవ్వాలంటే దూరం నుండే ఆయన టేబుల్ మీదకు విసిరేసేవారు. చదవాలన్న, పని చేయాలన్న, ఉండడానికి ఇల్లు కావాలన్నా, చివరికి నీళ్లు తాగాలన్న కూడా కులం అడ్డు వచ్చేది. ఉద్యోగం చేసుకుంటూనే 1927 నుండి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాడు. ఇలా మహద్ లో దళితుల మహా సభని ఏర్పాటు చేసారు. దేశంలో నలుమూలల నుండి కొన్ని వేళ మంది దళితులు ఆ సభకు హాజరయ్యారు. అప్పటివరకు దళితులు మహద్ లోని చెరువులో నీటిని తాగడానికి అనుమతి ఉండేది కాదు. కానీ అంబేద్కర్ ఆ సభలో దానికి వ్యతిరేకంగా పోరాడి ఆ చెరువులో నీటిని తాగడానికి అనుమతి వచ్చేలా చేసారు. కొల్హాపూర్ మహారాజ్ సాహు మహరాజ్ అస్పృశ్యత , అంటరానితనాన్ని నివారించడానికి కృషి చేస్తున్నారు అని తెలుసుకుని ఆయన సహకారంతో మూగ వాళ్ళకి నాయకుడు అనే అర్థం వచ్చేలా 'మూక్ నాయక్' అనే పత్రికను అలాగే బహిష్కృత్ భారత్, జనతా , ప్రబుద్ధ భారత్ అనే పత్రికలూ నడిపారు. ళితులకు బడులలోకి, గుడులలోకి వెళ్ళడానికి అనుమతి పొందేలా ఉద్యమాలు చేపట్టి విజయం సాధించారు. ఆయన అంత స్థాయికి ఎదిగారు అంటే కారణం చదువు. ఃూబట్టే ఆయన అందరికి చదువు అందా లని కృషి చేసారు. ఆయితే సంపద కోసమో, అధికారం కోసమో పోరాటం చేయలేదు అట్టడుగు వర్గాల స్వేచ్ఛ కోసం ఆయన పోరాడేవారు. శోధించు, సమికరించు, పోరాడు అనే సిద్ధాంతంతో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, కులమాత బేధాలు లేని సమాజం కోసం కృషి చేసేవారు.స్వాతంత్రం వచ్చిన తరువాత అంబేద్కర్ కి కేంద్ర మండలిలో మొట్ట మొదటి న్యాయశాఖ మంత్రి గా పదవి వచ్చింది. అంతేకాదు భారత దేశపు రాజ్యాంగాన్ని రాసే అవకాశం దక్కింది. అయితే రాజ్యాంగం రచించడానికి నియమించిన సభ్యులలో ఒకరు రాజీనామా చేయడం, మరొకరు మరణించడం, కొంతమంది అమెరికాలో ఉండిపోవడం, మరికొంతమంది రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులవడం ఇలా రకరకాల కారణాల వలన భారత రాజ్యాంగం రచించే బాధ్యతంతా అంబేద్కర్ మీద పడింది. దాంతో ఆయన రాత్రీపగలు అనే తేడా లేకుండా నిరంతరం రాజ్యాంగ రచనలోని ఉండేవారు.

## శ్రీ రామ స్వామివారి శోభ యాత్రకు ఘనంగా స్వాగతం



**విశాఖపట్నం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్)** : జయనగరం జిల్లా, నెల్లిమర్ల మండలం, రామతీర్థంలో వేంచేసియున్న శ్రీ రామస్వామి వారి భిన్నమైన విగ్రహాలను జలాధివాసం (నిమజ్జనం) చేయుటకు జరుగుతున్న శోభాయాత్ర సోమవారం ఉదయం రాజపు లోవ వద్ద (విశాఖపట్టణం బోర్డర్)కు చేరుకుంది. ఈ శోభాయాత్ర కార్యక్రమములో విశాఖపట్టణం జిల్లా, దేవాదాయ ధర్మదాయ శాఖ, ఉప కమీషనరు ఎన్. సుజాత, సహాయ కమీషనరు టి. అన్నపూర్ణ,అనకాపల్లి జిల్లా ఏసీ సుధారాణి వివిధ ఆలయాల కార్యనిర్వహ ణాధికారులు, సిబ్బంది భాగస్వాములై స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల గుండా శోభాయాత్ర సాగింది. ఈ కార్య క్రమములో అధిక సంఖ్యలో భక్తులు, సేవకులు పాల్గొని హారతులతో, పుష్పాలతో శ్రీ స్వామి వారిని కీర్తించారు. అనంతరం అనకాపల్లి జిల్లా వైపు యాత్ర కొనసాగింది. అనకాపల్లి జిల్లాలోని హైవేలో శ్రీ నూకాలమ్మ ఆర్చిగేటు వద్ద శ్రీ స్వామివారి శోభాయాత్రకు విశాఖ పట్టణం జిల్లా అధికారులు అధికారులు వీడ్కోలు పలకగా, అనకాపల్లి జిల్లా దేవాదాయ శాఖ అధికారులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమములో నెలిమర్ల శాసన సభ్యులు లోకం మాధవి, మాన్సాస్ ట్రస్టు, ఉప కమీ షనరు, కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, రామతీర్థం సహాయ కమీషనరు మరియు కార్యా నిర్వహ ణాధికారి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ చట్టం పై ఇగ్నోలో చర్చా కార్యక్రమం




**విశాఖపట్నం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్)** :ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో), విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఈ రోజు అనగా 13 ఏప్రిల్ 2026 న " నారీ శక్తి వందన అధినియం–2023" గా పిలువబడే మహిళా రిజర్వేషన్ చట్టం పై ఒక అవగాహనా సదస్సు మరియు చర్చా కార్యక్రమం నిర్వహించింది. ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డా. గోనిపాటి ధర్మారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇగ్నో అధ్యయన కేంద్రాలు– ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల, ఐఏఎస్సి, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా డా. ధర్మారావు మాట్లాడుతూ ఈనాటి చర్చా కార్యక్రమ ఉద్దేశ్యం, మహిళా రిజర్వేషన్ చట్టం ఆవశ్యకత, చట్టం చరిత్ర, ముప్పైఏళ్ల పోరాటం, వివిధ పరిమితులు వంటి అనేక విషయాలను సభకు వివరించారు. భారతదేశంలోని విభిన్న రాజకీయ సాంఘిక పరిస్థితుల దృష్ట్యా ఈ మహిళా రిజర్వేషన్ చట్టానికున్న విశేష ప్రాధాన్యత, దేశ ప్రజలలో సగం ఉన్న మహిళల ప్రాతినిధ్యం కనీస శాతం కూడా లేకుండా ఉండాడానికి దారితీస్తున్న పరిస్థి తులను చర్చించాల్సిన ఆవశ్య కతను తెలియ జేశారు. విద్యా ర్థులు ముఖ్యంగా కొత్తతరంలో ఈ ఆలోచనలు రావాలని, ఈ చట్టం దాని ఉద్దేశాను సారం అమలుకు నోచుకొని ఏ అవాంతరాలు లేకుండా కొనసాగాలని అభిల షించారు. చర్చా కార్య క్రమంలో పాల్గొన్న ఐఏఎస్సి, ఆంధ్ర విశ్వవిద్యా లయం అధ్యాపకులు డా. ఎం. పుష్పరాజ్యం చర్చను ప్రారంభిస్తూ మహిళా చట్టం అవసరాన్ని విశదీకరించారు. అలాగే ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపకులు శ్రీమతి వసంత తదితరులు చర్చలో పాల్గొంటూ మహిళా రిజర్వేషన్ అమలులోని సాధక బాధకాలను, వాటిని అధిగమించాల్సిన విధానాన్ని వివరించారు. ఇగ్నో అధ్యయన కేంద్రాలనుండి చర్చలో పాల్గొన్న సుమారు యాభై మంది విద్యార్థినులు చాలాచక్కగా వివిధ ఉదాహరణలతో చట్టంలోని కీలకాంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో ఉద్యోగులు శ్రీ నర్సింగ బెహెరా, విజయ్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

**డా. గోనిపాటి ధర్మా రావు**
**సీనియర్ ప్రాంతీయ సంచాలకులు**




## ఉచిత మెగా కంటి వైద్య శిబిరం




**భీమునిపట్నం ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్)** : ప్రజల ఆరోగ్యమే తమ బాధ్యత అన్న లక్ష్యంతో తగరుపువలస ఆదర్శనగర్ బైపాస్ రోడ్డులోని రాజా హాస్పిటల్ పక్కన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజా హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ బండారు వెంకటేష్ ఆధ్వర్యంలో, బిగ్ బాస్ విజేత కళ్యాణ్ పడాల అభిమానుల ఆర్థిక సహాయం, వెంపాడ శ్రీనివాసరెడ్డి సహకారంతో ఈ శిబిరం నిర్వహించారుఈ శిబిరంలో మొత్తం 110 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వ హించగా, అందులో 40 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అలాగే 30 మందికి ఉచిత కళ్లద్దాలు అందజేశారు. శిబిరానికి వచ్చిన వారికి అదనంగా షుగర్, బీపీ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు ప్రవళిక, ఆదిత్య, ఆప్టోమెట్రిస్ట్ గిరిజ, నర్సింగ్ సిబ్బంది విజయకుమారి పాల్గొన్నారు. శిబిరం సమన్వయకర్తగా వై. రాజు సేవలు అందించారు.

ప్రజల నుంచి ఈ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహిస్తామని వెల్లడించారు.

## సామాన్య భక్తులకు సజావుగా దర్శనం: గంటా




**సింహాచలం,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్)** : సామాన్య భక్తులకు సజావుగా స్వామివారి నిజరూప దర్శనం జరిగేలా చూడాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ఆయన చందనోత్సవం ఏర్పాట్లను పరిశీలించినఅనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉత్సవ నిర్వహణను ప్రభుత్వం ప్రతిష్టాకరంగా తీసుకుని ఈనెల 15 వ తేదీ నాటికే ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశిం చిందని చెప్పారు. గత ఏడాది చందనోత్సవం నాడు చోటు చేసుకున్న దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా మంత్రుల కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షిస్తోందని తెలిపారు. సాధారణ రోజుల్లో స్వామిని దర్శించు కోవడానికి వచ్చే భక్తుల సంఖ్యతో పోల్చుకుంటే చందనోత్సవం, గిరి ప్రదక్షిణ రోజుల్లో కనీసం 10 రెట్లు ఎక్కువ మంది వస్తారని వెల్లడించారు. ఆ సంఖ్యకు తగ్గట్టు సౌకర్యాలు కల్పించడం యంత్రాంగానికి అతి పెద్ద సవాలన్నారు. ఈసారి చందనోత్సవానికి పూర్తి స్థాయి ఈఓ ఉన్న కారణంగా ఉత్సవం మరింత సమర్థంగా జరుగుతుందని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం ఇచ్చిన నియమావళిని స్వామి దర్శనానికి వచ్చే భక్తులు విధిగా పాటించాలన్నారు. దేవస్థానం నిర్దేశించిన స్లాట్ లలో దర్శనాలు చేసుకుని, మిగిలిన భక్తులకు ఇబ్బంది కలిగించకుండా సహకరించాలని కోరారు.

**ఏర్పాట్లను సమీక్షించిన గంటా** : ఈనెల 20 న జరగనున్న చందనోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే గంటా పరిశీలించారు. క్యూ లైన్లు, మంచినీటి సౌకర్యం, రవాణా, ప్రసాదాలు, పార్కింగ్ తదితర అంశాల గురించి ఈఓ జె. వెంకట్రావు వివరించారు. ఆన్ లైన్, ఆఫ్ లైన్లలో జారీ చేస్తున్న టికెట్లు.. వాటి స్లాట్ వివరాలు తెలియజేశారు.



**చందనం అరగదీత**

చందనోత్సవాన్ని పురస్కరించుకుని గంటా శ్రీనివాసరావు సింహా చలం ఆలయంలో చందనం చెక్కను అరగదీశారు. సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న అనంతరం సంప్రదాయ దుస్తులలో ఆయన గంధపు చెక్కను అరగదీశారు. సంవత్సమంతా చందనంతో నిండి ఉండే నృసింహా స్వామి ఒక్క చందనోత్సవం రోజున మాత్రానే నిజరూప దర్శనమిస్తారు. ఈ ఉత్సవం అనంతరం స్వామి వారిని కప్పడానికి చందనాన్ని సిద్ధం చేసే క్రమంలో సోమవారం నుంచి గంధం అరగతీత ప్రారంభించారు. ఈఓ జె. వెంకట్రావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, ప్రధాన అర్చకుడు శ్రీని వాసాచార్యులు, టీడీపీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, పీవీ నరసింహం, పంచదార్ల శ్రీనివాస్, గుసిడి శంకర్రావు, గాడు వెంకటప్పడు, నాగోతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


## మరిడిమాంబ అమ్మవారి దేవాలయపురం నిర్మాణంనకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కోళ్ల

### అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నా ఎమ్మెల్యే





**కొత్తవలస, ఏప్రిల్ 13, నేటిమనదేశమ్ ప్రతినిధి** : భక్తిభావం మనిషికి మానసిక ప్రశాంతతను ఇవ్వడమే కాకుండా, సమా జంలో ఐక్యతను పెంపొందిస్తుందని ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం కొత్త వలస మండలం, అప్పన్న పాలెం పంచాయతీ పరిధి లోని దత్తి – దన్నిపేట గ్రామాల మధ్య వేంచేసి ఉన్న మరిడిమాంబ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ చేశారు ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కోళ్లకు గ్రామస్తులు ఘన స్వాగతం పలుకగా వేద పండితులు ఆశ్రవతనం అందించారు అన ంతరం ఆలయ పునర్నిర్మాణ పనులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ దేవతల అనుగ్రహం వల్ల గ్రామాల్లో పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని, గ్రామాలలో ఉన్న ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో ఐక్య మత్యంతో ఆలయ పునర్ని ర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ మాట్లా డుతూ.. ధర్మ పరిరక్షణలో భాగంగా ఆలయాల పునర్ని ర్మాణానికి ప్రభుత్వం మరియు దాతల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజ లందరిపై మరిడిమాంబ అమ్మవారి దీవెనలు ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో, పి ఎ సి ఎస్ చైర్మన్ మరియు మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల వెంకట రమణ, కొత్తవలస గ్రామ పార్టీ అధ్యక్షులు కోరుపోలు అప్పారావు, మండల పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ తిక్కాన పైడిరాజు, టీడీపీ నాయకులు దన్నిన రమేష్, జిన్నాల రాము నాయుడు, స్థానిక కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు దత్తి, దన్నిపేట గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా సామాజిక చైతన్య బైక్ యాత్ర

**రావికమతం (నేటి మనదేశమ్)** : అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ అజయ్ పురం గ్రామంలో గిరిజన సంఘం., కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అజయ్ పురం గ్రామంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి అజయ్ పరువు నుండి జోగంపేట, నేరేడు బంధ, కళ్యాణ్ లావా వరకు బైకే యాత్ర నిర్వహించడం జరిగింది. ఎస్సీ ఎస్టీ చట్టాన్ని ఆర్టికల్ 9 షెడ్యూల్లో చేర్చాలని, నాన్ షెడ్యూల్ గిరిజన మండలాలను ఏజెన్సీ ఏరియాలో కలపాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు.

## ఎండాకాలంలో చర్మాన్ని కాపాడే చిట్కాలు



ఎండాకాలంలో చర్మం పగులుతుంది. పొడిబారుతుంది. ఈ కాలంలో చర్మం సున్నితత్వం కోల్పోయి చాలా రఫ్‌గా మారుతుంది. అందుకే శీతాకాలంలో చర్మ సంరక్షణపై తగిన శ్రద్ధ తీసుకోవాలి. ఈ కాలంలో చిన్న చిన్న చిట్కాలతో చర్మం పొడిబారకుండా చూసుకోవచ్చు. మరి ఆ చిట్కాలేంటో తెలుసుకుందామా..!

– కొబ్బరినూనె చర్మానికి రాసుకుంటే పొడిబారకుండా ఉంటుంది. – ఈకాలంలో చర్మానికి రాసే క్రీములకు బదులుగా.. పాల మీగడ, వెన్న చర్మానికి రాసుకుంటే.. పొడిబారడం తగ్గుతుంది. మృదువుగా మారుతుంది.– వాతావరణం చల్లగా ఉండడం వల్ల నీటిని తక్కువగా తీసుకుంటాం. దీంతో శరీరం డీహైడ్రేడ్ అయి చర్మం పొడిబారటానికి కారణమవుతుంది.ˇుకే చలికాలంలో నీటిని తాగడంపైనా శ్రద్ధపెట్టాలని వైద్యులు చెబుతున్నారు.

## అరటిపండ్లు తినేప్పుడు నీళ్లు తాగకూడదు.!



మనం సాధారణంగా ఏదైనా ఆహారం తినేప్పుడు నీళ్లు తాగడం సహజం. అయితే కొన్ని ఆహారపదార్థాలు తినేప్పుడు నీరు తాగకూడదని నిపుణులు చెబుతున్నారు. అరటిపండులో కరిగే ఫైబర్ అధికంగా ఉంటుంది. అరటిపండు తినేప్పుడు నీళు ఎక్కువగా తాగితే కడుపులోని గ్యాస్ట్రిక్ జ్యూస్‌లు కరిగిపోతాయి. దీని కారణంగా జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అరటిపండ్లు తినేప్పుడు నీళ్లు తాగొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

## వైట్ రైస్ ఎక్కువగా తింటున్నారా?



మూడు పూటలు వైట్ రైస్ తినడం ఆరోగ్యానికి మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక గ్లైసిమిక్ ఇండెక్స్ ఉన్న ఆహార వనరులతో వైట్ రైస్ ఒకటి. వైట్ రైస్ డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది. అందుకే పరిమిత పరి మాణంలో మాత్రమే తినాలి. ఇతర ధాన్యాలతో పోలిస్తే వైట్ రైస్‌లో తక్కువ పోషకాలు ఉంటాయి. పూర్తి స్థాయిలో పోషకాలు అందక.. ఎముకలు, దంతాల క్షీణత, పలు రకాల సమస్యలకు దారి తీస్తుంది. రోగనిరోధక శక్తి బలహీనపరుస్తుంది.

## జుట్టు మెరవాలంటే...



చలికాలంలో జుట్టుకు మరింత పోషణ అవసరం. పొడి వాతావరణం, కాలుష్యం కారణంగా ఈ సీజన్‌లో జుట్టు త్వరగా డల్‌గా మారుతుంది. తేమను కోల్పోతుంది. దీంతోపాటు చుండ్రు సమస్య వెంటాడుతుంది. ఇలాంటి స్థితిలో జుట్టు మృదువుగా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి.తల స్నానం చేసే ముందు తప్పనిసరిగా ఆయిల్ మసాజ్ లేదా షాంపూ–కండీషనర్ ఉపయోగించాలి. ఆ తర్వాత తలస్నానం చెయ్యాలి. ఇలా చేయడం వల్ల జుట్టు మృదుత్వం కోల్పోకుండా ఉంటుంది. కోల్పోయిన తేమను పునరుద్ధరిస్తుంది.చలికాలంలో జుట్టు ఊడడం లేదా చిట్లడం సమస్య ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్య రాకుండా ఉండాలంటే సహజసిద్ధంగా తయారుచేసిన హెయిర్ జెల్ ఉపయోగించాలి.షాంపూ చేసిన తర్వాత తడి జుట్టు మీద ఈ హెయిర్ జెల్ రాసుకోవాలి. ఈ జెల్‌ని జుట్టు మూలాలకు అంటే తలకు పట్టించకూడదు. జుట్టుకు మాత్రమే అప్లై చేయాలి. ఇది జుట్టుకు సహజమైన మెరుపును అందిస్తుంది.ఇంట్లో తయారుచేసిన హెయిర్ జెల్‌ను 10–15 రోజుల వరకు నిల్వ చేయవచ్చు. కండీషనర్ ఉపయోగించిన తర్వాత షాంపూ చేసినప్పుడల్లా ఈ హెయిర్ జెల్‌ని ఉపయోగించవచ్చు.

హెయిర్ జెల్ ఎలా తయారుచేసుకోవాలంటే..

ఒక స్ప్రే బాటిల్‌లో 4–5 టీస్పూన్ల రోజ్ వాటర్, 1 టీస్పూన్ తాజా అలోవెరా జెల్ కలుపుకోవాలి. ఆ తరువాత దీనికి 1 స్పూన్ విటమిన్ ఇ నూనె లేదా బాదం నూనెను కూడా కలుపుకోవాలి. ఇప్పుడు దీనికి 1–2 స్పూన్ల నీళ్లు కలుపుకుంటే హెయిర్ జెల్ సిద్ధం అయినట్లే.

## ఈ ఆకుకూరలు తినండి.. బరువు తగ్గుతారు!



ఆకుకూరలు తినాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆకుకూరల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుందని, జీవక్రియ మెరుగుపడి బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. ఫైటో న్యూట్రియెంట్స్, విటమిన్స్, మిన రల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఆకు కూరల్లో పుష్కలంగా ఉంటాయి. డైటింగ్ చేసే వారు తప్పనిసరిగా ఆకుకూరలు తినాలి. చామకూర, గోంగూర, పాలకూర, తోటకూర, మెంతికూర, మునగాకు వంటి ఆకుకూరలను ప్రతి రోజు తినాలి.

## బరువు తగ్గేందుకు ఏడు రకాల అద్భుతమైన సూప్‌లు ఇవే



బరువు తగ్గాలనుకుంటున్నారా..అయితే ఈ 7 రకాల హై ప్రోటీన్డ్ సూప్స్ ట్రై చేయండి. శీతాకాలంలో వెచ్చదనంతో పాటు..మీ వెయిట్ కూడా తగ్గిస్తుంది. అదెలాగో చూద్దాం.

సూప్స్ అనేవి రుచితో పాటు ఆరోగ్యానికి చాలా మంచివి. త్వరగా జీర్ణమవడమే కాకుండా నీరసంగా ఉన్నప్పుడు లేదా ఒంట్లో బాగా లేనప్పుడు అద్భుతంగా పనిచేస్తాయి. ముఖ్యంగా శీతాకాలంలో శరీరంలో ఉష్ణోగ్రత పడిపోయినప్పుడు సూప్స్ తీసుకుంటే చాలా మంచిది. ఇవి శరీరానికి వెచ్చదనాన్ని కలగజేయడమే కాకుండా..బలాన్ని అందిస్తాయి. అంతేకాదు..కొన్ని రకాల సూప్స్ శరీర బరువును కూడా తగ్గిస్తాయంటున్నారు న్యూట్రిషన్ నిపుణులు.

**అటువంటి 7 రకాల సూప్స్ మీ కోసం...**

క్యాబేజ్ సూప్ క్యాబేజ్ సూప్ అనేది చాలా ప్రాచుర్యమైందే. ఎక్కువ మోతాదులో క్యాబేజ్ సూప్ తీసుకోవడం ద్వారా అధిక బరువును తగ్గించుకోవచ్చు. ఇంకెందుకు ఆలస్యం..ఈ శీతాకాలంలో క్యాబేజ్ సూప్ ఎక్కువగా తీసుకోండి.

**పప్పులు, ఆనపకాయ, రేగుపండ్ల సూప్** : నాన్ వెజ్ ఆహారం వద్దనుకునేవారికి ఈ సూప్ చాలా మంచిది. శరీరానికి కావల్సిన ప్రొటీన్ అవసరాల్ని తీర్చేందుకు ఈ సూప్స్ చాలా ఉపయోగపడుతాయి. శరీరానికి బలాన్ని ఇవ్వడమే కాకుండా..బరువు తగ్గించడంలో ఈ సూప్స్ చాలా దోహదపడుతాయి.

**చికెన్ సూప్** : చికెన్ లేకుండా ఆహారం అంటే చాలా మందికి నచ్చదు. ఎందుకంటే ఎక్కువశాతం ప్రజలు ఇష్టపడే నాన్ వెజ్ చికెన్. అయితే ఇదే చికెన్ సూప్ శరీరంలో అధికాకంగా ఉన్న బరువును, ఫ్యాట్‌ను కరిగిస్తుందని ఎంతమందికి తెలుసు. ఇదే చికెన్ సూప్‌ను బీన్స్ , టొమాటోతో కలిపి తీసుకుంటే ఇంకా ప్రయోజనకరం.

**స్పినాచ్ సూప్** : శీతాకాలంలో మధ్యాహ్నం వేళల్లో ఆకలేసినప్పుడు లేదా ఏదైనా తినాలన్పించినప్పుడు.. మంచి వెన్నతో కలిపిన స్పినాచ్‌ను తీసుకుంటే చాలా మంచిది. ఇది మంచి రుచిని అందించడమే కాకుండా..ప్రోటీన్ ఫుడ్‌గా ఉంటుంది. శరీరానికి బలాన్ని ఇస్తుంది. బరువు తగ్గిస్తుంది.

**క్యారట్, టొమాటో సూప్** : ఎక్కువ మొత్తంలో పోషక పదార్థాలు, విటమిన్లతో కూడిన క్యారట్, టొమాటో సూప్ ఇది. క్యారట్, టొమాటో సూప్ అద్భుతమైన రుచితో పాటు మంచి శక్తిని అందిస్తాయి. క్యారట్స్ అనేవి తక్కువ కేలరీలు కలిగి ఉంటాయి.

**గ్రీన్ పీస్ సూప్** : ఇంట్లో రొటీన్ వంటలో విసుగు చెందినప్పుడు బఠాణీ సూప్ కొత్తదనాన్ని ఇస్తుంది. ఆరోగ్యపరంగా చాలా ప్రయోజనాలను కలిగి ఉంటాయి బఠాణీలు. మీ ఆహారంలో బఠాణీల సూప్ చేర్చుకుంటే కొత్తదనంతో పాటు బరువు కూడా తగ్గుతుంది.

**మకరానీ పాస్తా సూప్** : ఇది కచ్చితంగా లోఫ్యాట్ సూప్. ఈ సూప్‌తో చాలా లాభాలున్నాయి. కొద్దిగా చికెన్ లేదా వెజిటెబుల్స్‌తో కలిపి సూప్ చేస్తే రుచితో పాటు అద్భుత ప్రయోజనాలు కలుగుతాయి. బరువు తగ్గడంలో ఈ సూప్ దోహదపడుతుంది.

## స్వీట్స్ కోరిక అణచుకోలేకపోతున్నారా.. సులభమైన ఈ చిట్కాలు పాటించండి



తీపి మోతాదు మించితే చేదవుతుంది. ఎక్కువైతే ఎప్పటికీ అనర్థమే. అయినా కొంతమంది తీపి పదార్థాలు మానలేకపోతుంటారు. బరువును పెంచడంలో స్వీట్స్ కీలకపాత్ర పోషిస్తాయి. ఈ క్రమంలో స్వీట్స్ మానేయాలంటే..ఏం చేయాలో తెలుసుకుందాం.

సుగర్ క్రేవింగ్. అంటే స్వీట్స్ పట్ల వ్యామోహం లేదా ఇష్టం. ఈ అలవాటున్నవారు ఎంత నియంత్రించుకోవాలనుకున్నా సాధ్యం కాదు. స్వీట్స్ అదే పనిగా తినేస్తుంటారు. బరువు తగ్గించుకోవాలనుకునేవారికి లేదా మధుమేహంతో బాధపడుతున్నవారికి ఇది చాలా ఇబ్బంది కల్గించే పరిణామం. డైటింగ్‌లో ఉన్నప్పుడు ఫ్రైడ్ ఆహార పదార్థాలు, స్వీట్స్ మానకపోతే బరువు పెరిగిపోతుంటుంది. కొంతమంది ఎంతగా ప్రయత్నించినా ఈ అలవాటును మానుకోలేరు. స్వీట్స్ తినకపోతే ఏదో పోగొట్టుకున్నట్టు భావిస్తుంటారు. మరి ఏం చేయాలి. ఈ అలవాటున్నవారు కొన్ని సులభమైన చిట్కాలు పాటిస్తే..స్వీట్స్ నుంచి దూరంగా ఉండవచ్చు.

ఒకవేళ మీకు స్వీట్స్ తినాలనే కోరిక ఉంటే..వెంటనే ఓ గ్లాసు నీళ్లు తాగేయండి. ఇలా చేస్తే మీ కడుపు నిండి ఆకలేయదు. ఇలా ఏదో ఒక రోజు కాదు..అదే అలవాటుగా చేసుకుంటే స్వీట్స్ నుంచి మైండ్ డైవర్ట్ అవుతుంది.

చాలామంది డైటింగ్ సందర్భంగా కఠినమైన నియమాల్ని పాటిస్తుంటారు. కేవలం పండ్లు మాత్రమే తింటుంటారు. వీటితో పాటు నట్స్ ఇతర పదార్థాలు తినాల్సి ఉంటుంది. ఇవి చాలా ఆరోగ్యకరం. ఇలా చేస్తే మీరు ఎక్కువసేపు ఆకలిని నియంత్రించుకోవచ్చు. కేవలం పండ్లు తింటే మాత్రం ఇంకా ఏదో తినాలనే కోరిక ఉంటుంది.

ఎప్పుడైనా స్వీట్స్ లేదా మరేదైనా తినాలనుంటే వెంటనే కొద్దిదూరం వాకప్‌కు వెళ్లడం అలవాటు చేసుకోండి. ఇలా చేయడం వల్ల చాలా ప్రయోజనముంటుంది. స్వీట్స్ నుంచి దూరంగా ఉండటమే కాకుండా..వర్కవుట్ లేదా వాకప్ కారణంగా ఫీల్‌గుడ్ హార్మోన్స్ విడుదలవుతాయి. ఇవి మీకు ప్రశాంతతను చేకూరుస్తాయి.

తీపి పదార్థాలు తినాలనే కోరిక కలగడానికి ముఖ్య కారణం వల్ల బ్లడ్ సుగర్ లెవెల్స్ పెరగడంతో పాటు ఒత్తిడి కూడా ఓ కారణం. ఒకవేళ మీకు ఎప్పుడైనా కష్టంగా ఉన్నట్టు అన్పిస్తే..వెంటనే ఆరోగ్యకరమైన పదార్థాలు తిని కడుపు నింపుకోండి. ఇలా చేస్తే స్వీట్స్ తినాలనే కోరిక పోతుంది. బరువు పెరగకుండా ఉంటుంది.

ఒకవేళ మీకు సరిగ్గా నిద్ర పట్టకపోయినా లేదా నిద్ర సరిపోకపోయినా..మీ దేహం స్వీట్స్ కోరుకుంటుంది. ఎందుకంటే శక్తి కోసం. అందుకే ప్రతి రోజూ కనీసం 6-8 గంటలు నిద్రపోయేందుకు ప్రయత్నించండి.

ఒకవేళ మీకు ఉదయం వేళల్లో బ్రేక్‌ఫాస్ట్‌గా ఆరోగ్యకరమైన పదార్థాలు తీసుకుంటే మీకారోజు ఆరోగ్యంగా ఉంటుంది. మీకు ఆ రోజంతా బాగుంటుంది. దీనివల్ల మీకు స్వీట్స్ తినాలనే కోరిక తగ్గుతుంది. ప్రోటీన్స్ ఉండే పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే మంచిది.

## కూరగాయల జ్యూస్‌లు.. కలిగే ఆరోగ్య ప్రయోజనాలు



ప్రకృతిలో లభించే కూరగాయల్లో ఆరోగ్యానికి మేలు చేసే వివిధ రకాల గుణాలుంటాయి. కూరల్లానే కాకుండా..జ్యూస్ రూపంలో తీసుకున్నా అద్భుత ప్రయోజనాలు చేకూరుతాయి. ఆ ప్రయోజనాలేంటనేది చూద్దాం.

ప్రకృతిలో ఎన్నో రకాల మొక్కలు, ఆహార పదార్థాలు ఉన్నాయి. ఒక్కొక్క రకం మొక్కల్లో ఒక్కోరకం గుణాలున్నాయి. ప్రతి కూరగాయకూ ఓ విశిష్టమైన గుణముంది. కూరగాయలతో అధిక బరువు, ఊబకాయం, బానపొట్ట వంటి చాలా రకాల సమస్యల్ని తొలగించుకోవచ్చు. ప్రతిరోజూ క్యాబేజ్ జ్యూస్ తాగితే..ఎప్పట్నించో నయం కాని జబ్బులు నయమౌతాయి. కడుపులో అల్సర్లు వంటివి నయమౌతాయి. మధుమేహం ఉన్నవారికి షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. ఊబకాయం తగ్గుతుంది.

ఇక బీట్‌రూట్ రసంతో (%దీవవ్‌తీశోీ జీబఱఱఎవ%) కంటి చూపు మెరుగు పడుతుంది. అజీర్తి, పెప్టిక్ అల్సర్, కడుపు నొప్పి సమస్యలకు మంచి పరిష్కారం. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరగాలంటే బీట్‌రూట్‌కు మించింది మరొకటి లేదు. క్యారెట్ జ్యూస్ చాలా రకాల సమస్యలకు అద్భుతమైన ఔషధం. ఇందులో అధికంగా ఉండే విటమిన్ ఏ కంటికి చాలా మంచిది. కేన్సర్ కణాల్ని నిరోధించే గుణం క్యారెట్‌లో ఉంది. కొలెస్ట్రాల్ వంటి సమస్యలున్నవారు క్యారట్ జ్యూస్ తాగితే చాలా మంచిది.

కీరా లేదా దోసకాయ జ్యూస్‌తో అన్ని రకాల కడుపు సంబంధిత సమస్యలు దూరమౌతాయి. దోసకాయ ఒంటికి చలవ కల్గిస్తుంది. ఉల్లిపాయ జ్యూస్ చాలా మందికి తెలియదు. ఉల్లిపాయలో అద్భుతమైన యాంటీ బయోటిక్ గుణాలున్నాయి. గాయమైనప్పుడు ఉల్లిరసం రాస్తే..త్వరగా నయమౌతుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను కూడా తగ్గిస్తుంది. బూడిద గుమ్మడి జ్యూస్ క్రమం తప్పకుండా తీసుకుంటే..కిడ్నీలో రాళ్ల సమస్య, స్త్రీలలో రుతు సమస్య, అధిక రక్తస్రావం, మలబద్దకం, ఎసిడిటీ వంటివి దూరమౌతాయి. ఇక ప్రతి రోజూ టమోటా రసం తీసుకోవడం ద్వారా ఒంట్లో వేడి తగ్గుతుంది. ముఖంలో కళ పెరుగుతుంది. అదే సమయంలో ముఖంపై మొటిమలు కూడా పోతాయి.

ఇమ్యునిటీ కోసం ఇవి ఎక్కువగా తీసుకుంటే.. మరో పెద్ద రిస్క్ తప్పదు

స్థానికం నుంచి అంతర్జాతీయం వరకు.. క్రీడలు, వినోదం, రాజకీయాలు, విద్య, ఉద్యోగాలు, హెల్త్, లైఫ్‌స్టైల్ .. అన్నిరకాల వార్తలను తెలుగులో పొందడం కోసం ఇప్పుడే హిందుస్థాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి.

## ఈ లక్షణాలు కనిపిస్తే హార్ట్ ఎటాక్ రావచ్చంట జాగ్రత్త!



హార్ట్ ఎటాక్ .. ఇటీవలి కాలంలో వయసుతో సంబంధంలో లేకుండా చాలా మంది ఎదుర్కొంటున్న తీవ్ర ఆరోగ్య సమస్య. హైపర్? టెన్షన్?, గ్యాస్ట్రిక్ ఎసిడిటీతో బాధ పడుతున్న వారికి కూడా హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదముందని ఓ నివేదికలో తేలింది.

ఎసిడిటీ, హైపర్? టెన్షన్? వల్ల వచ్చేది కేవలం పానిక్ ఎటాక్ మాత్రమే కావచ్చు అనేది ఆ నివేదిక సారాంశం. అయితే ఇది హార్ట్ ఎటాక్‌కు దారి తీసే సంకేతంగా భావించాలని పేర్కొంది బ్రిటిష్ హార్ట్ ఫౌండేషన్.

బీహెచ్‌ఎఫ్ ప్రకారం.. ఈ పానిక్ ఎటాక్ కూడా గుండె పోటు వంటి లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది గుండె పోటు ఆందోళనలు మరింత తీవ్రం చేస్తుందని చేస్తుంది. ఇంకా చెప్పాలంటే గుండె జబ్బులతో బాధపడుతున్న వ్యక్తి.. పానిక్ ఎటాక్?కు గురైనా అందులో హార్ట్ ఎటాక్ ను పోలిన లక్షణాలు ఉంటాయని బీహెచ్‌ఎఫ్ నిపుణులు చెబుతున్నారు.పానిక్ ఎటాక్ లక్షణాలు ఇలా..

ఊపిరాడకపోవడం, నలతగా అనిపించడం, అలసటగా ఉండటం లేదా శరీరం వేడెక్కడం, గుండె నొప్పిగా అనిపించడం, గుండెలో ఆందోళనగా అనిపించడం, ఎక్కువ చలి లేదా వేడిగా అనిపించడం, కళ్లు మసకబారడం, వేళ్లు జలదరించడం, చెవిలో శబ్దాలు వినిపించడంలక్షణాలు ప్రభావం ఇలా.. హార్ట్‌ఎటాక్ కు సంబంధించిన లక్షణాలు ఒక్క సారిగా కనిపించడం లేదా కొన్ని రోజుల నుంచి కొనసాగుతూ రావచ్చు. వీటన్నింటికి తోడు గురక లేదా విపరీతమైన దగ్గు వంటి లక్షణాలు కూడా కనిపించొచ్చని బీహెచ్?ఎఫ్? హెచ్చరిస్తోంది. (ఊపిరి తిత్తుల్లో ద్రవాలు పేరుకుపోవడం వల్ల కూడా ఈ లక్షణాలు కనిపించొచ్చు.)

ఈ లక్షణాలన్నీ.. గుండెపోటుకు సంబంధించి సాధారణమైన లక్షణాలు. అలా కాకుండా.. మయో క్లీనిక్ ప్రకారం హార్ట్ ఎటాక్? వచ్చిన వారిలో కనిపించే సాధారణ లక్షణాలు ఇలా ఉంటాయి.

ఒత్తిడి, నొప్పి ఛాతీ, చేతుల్లో జలదరింపు.. అది నెమ్మదిగా మెడ, శరీరం వెనకవైపు సోకుతుంది.వికారంగా అనిపించడం, అజీర్తి, గుండెల్లో నొప్పిగా అనిపించపడం, కడుపు నొప్పి, ఊపిరి ఆడకపోవడం, చల్లని చెమటలు, అసలట, మైకం వంటివి కనిపిస్తాయి.తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. వీలైనంత త్వరగా ఆస్పత్రికి చేరుకునేలా ఏర్పాటు చేసుకోవాలి. అంబులెన్స్‌కు కాల్ చేసి పరిస్థితి) వివరించాలి. వైద్య సిబ్బంది వచ్చిన వెంటనే మీకు ఉన్న లక్షణాలను పూర్తిగా వివరించండి. హార్ట్ ఎటాక్‌గా అనుమానిస్తే.. ఆ వ్యక్తి కూర్చని ఆందోళనను అదుపు చేసుకుని కూర్చోవడం ఉత్తమం అత్యవసర సహాయం కావాల్సి వస్తే..

ఆస్పిరిన్ నమలడం మంచిదని మయో క్లినిక్ సలహా. ఇది మీ శరీరంలో రక్తం గట్టకట్టకుండా సహాయపడుతుంది. ఫలితంగా గుండె పనితీరు మెరగవుతుంది. అయితే ఇందుకు డాక్టర్ సలహా తప్పనిసరి అని మయో క్లీనిక్ చెబుతోంది.ముందస్తు జాగ్రత్తలు..:

హార్ట్ ఎటాక్ రాకుండా ముందస్తుగా కొన్న జాగ్రత్తలు తీసుకోవచ్చు. అవేమిటంటే.. ఆకు కూరలు అదికంగా తినడం మంచిది. కొవ్వు పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం ఎక్కవగా లభించే ఆహారం తీసుకోవాలి. చేపలు తినడం చాలా మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఎందుకంటే.. చెపల్లో ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండే ఆరోగ్యాన్ని కాపాడటంలో తోడ్పడతాయి. ఇక అన్నింటికంటే ముఖ్యంగా అధికంగా ఒత్తిడికి లోను కాకూడదు. ఒత్తిడి అనిపిస్తే.. కాసేపు విశ్రాంతి తీసుకుని తిరిగి ఉత్సాహంగా పని ప్రారంభించడం మంచిదని చెబుతున్నారు వైద్య నిపుణులు.

# స్వర్ణ చంద్రగిరి అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

## - జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశవమ్) :** స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధి నమూనాను ఆదర్శంగా తీసుకొని, స్వర్ణ చంద్రగిరి ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో, స్వర్ణ చంద్రగిరి అభివృద్ధి అంశంపై తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, స్వర్ణ చంద్రగిరి ప్రత్యేక అధికారి మరియు జిల్లా పంచాయతీ అధికారి శ్రీమతి సుశీల దేవి మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నూతన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, చిరుధాన్యాల సాగుపై రైతులను ఆకర్షిస్తూ పీఎండీఎస్ కిట్లను అందించాలని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పాల ఉత్పత్తి అభివృద్ధి, రైతు బజార్ల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని అన్నారు.

ఉద్యానవన రంగంలో మామిడి తోటల అభివృద్ధికి మ్యాంగో ఫ్రూట్ కవర్ల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. చంద్రగిరి పరిధిలోని చెరువులను గుర్తించి, మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా రంగంలో డిజిటల్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేయాలని, పాఠశాలలలో పెండింగ్ లో పనులను సమర్థవంతంగా అమలు చేయాలని, 'మనబడి - మన భవిష్యత్తు' కార్యక్రమం కింద పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, ఇంప్రూవ్‌మెంట్ ప్యానెల్‌లు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, యోగా తరగతులు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు.స్వర్ణ చంద్రగిరిలో ప్రతి ఇంటికి రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి గృహాలు మంజూరు చేయాలని సూచించారు. జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ అందించాల్సిందిగా చెప్పారు. పశువైద్య అధికారులు పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది. అలాగే కీటకనాశన మందులు పంపిణీ చేసి పశువులను వ్యాధుల నుండి రక్షించే చర్యలు చేపట్టాలన్నారు.పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, బీమా సదుపాయాలపై రైతులకు వివరాలు తెలియ చేయాలన్నారు. ఆధునిక పద్ధతుల్లో పశుపోషణ చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. శిబిరంలో పాల్గొన్న రైతులు పశువుల సంరక్షణకు సంబంధించిన సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ శిబిరం ద్వారా పశువుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో పాటు రైతులకు ఉపయోగకరమైన సమాచారం అందించాలని తెలిపారు. సంజీవని ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని, ఏబిహెచ్‌ఏ (ఆాదీనాూ) నమోదును 100% పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పోషణ్ 2.0 పథకంపై అవగాహన కల్పించాలని తెలిపారు.

జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఎంపీడీవోలు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను పూర్తి చేయాలని, ప్రతి ఒక్కరికీ ఆధార్, జనన ధృవపత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద స్వర్ణ చంద్రగిరి అభివృద్ధికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని, జిల్లా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. అన్ని శాఖ ల వారు అందరూ సమన్వయంతో వారికి కేటాయించిన విధులను నిర్దేశించిన సమయంలోపల పూర్తి చేయాలని సూచించారు. అనంతరం భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నారీ శక్తి వందన సమ్మేళనానికి సంబంధించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగిస్తున్న సందేశాన్ని వర్చువల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో డి ఈ ఓ కుమార్, సి పి ఓ రాజశేఖర్, ద్వామా పి డి శ్రీనివాసరావు, డి ఆర్ డి ఏ పి డి శోభన్ బాబు, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్,వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలి




**శ్రీకాకుళం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఎన్జీవో హోమ్‌లో ఇరాన్‌పై యుద్ధాన్ని ఖండిస్తూ, ప్రపంచ శాంతిని కోరుతూ జిల్లా పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథ రావు, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు తదితరులు మాట్లాడుతూ మానవజాతి మనుగడకు ప్రమాద కరంగా పరిణమించిన యు ద్ధాన్ని ఖండిం చారు. నాగరిక సమాజంలో ఆధిపత్యం కోసం, సహజ వనరుల దోపిడీకి యుద్ధాలు చేస్తున్న అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరే కించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మిస్కా కృష్ణయ్య, మద్దిల వినోద్ కుమార్, రామారావు, వెంకటరావు, మహిళా సంఘాల నాయకులు నాగమణి, భానుమతి, గీతారాణి, జోగారావు, దానయ్య, వైకుంఠరావు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

## - ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



**శ్రీకాకుళం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరు పేదలకు వరమని (సీఎంఆర్ఎఫ్), పేద కుటుంబాలు వైద్యంకోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. రణస్థలంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో తొమ్మిది మందికి రూ.10 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, అవసరాల్లో ఉన్నవారికి ప్రభుత్వం సహాయం తక్షణమే అందేలా కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోం దన్నారు. కార్య క్రమంలో నాయకులు డీజీఎం ఆనంద రావు, ముప్పిడి సురేష్, ఎం కనకారావు, పిషిని జగన్నాథంనాయుడు, శ్రీనివాసరావు, దుమ్ము అశోక్ పాల్గొన్నారు.

# మెరుగైన జీవనమే లక్ష్యం



**గజపతినగరం, ఏప్రిల్ 13 (నేటి మనదేశవమ్) :** ఎస్‌సి, ఎస్‌టిలకు మెరుగైన జీవన విధానం ఇవ్వడం, వారి ఉన్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని పాతబగ్గాం గ్రామంలో పిఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన కార్యక్రమంలో పాల్గొని రూఫ్‌టాప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సూర్య ఘర్ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్‌తో పాటు ప్రతి నెలా అదనంగా రూ.200 కూడా ఇస్తుందన్నారు. తొలి విడతలో రూ.170 కోట్లతో 15,018 మంది లబ్ధిదారులకు ఈ పథకం వర్తింపజేస్తున్నామని, 30.04 మెగావాట్ల కరెంట్ జిల్లాలో ఉత్పత్తి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 8,535 ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులు ఉంటే 2170 మందిని ఈ పథకం ద్వారా ఎంపిక చేశామన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటేనే యూనిట్ ధర తగ్గుతుందని, విద్యుత్ ఉత్పత్తి పెంచుకు నేందుకు ఈ పథకం ఉపయోగించుకోవాలని అన్నారు. సూర్య ఘర్ ఏర్పాటు చేసుకున్న వారికి మరో 25 ఏళ్ల కరెంటు బిల్లులు భారం ఉండదన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం ఇక గత ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో యూనిట్ రూ.15కు కొని ప్రజలపై సర్‌చార్జీల పేరుతో అధిక బిల్లుల మోపారని మంత్రి విమర్శించారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ లోఓల్టేజ్ సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నియోజకవర్గంలో రూ.3కోట్లతో 130 కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు మరో రూ.3 కోట్లతో ఎలక్ట్రికల్ పోల్స్ కూడా మార్చుతున్నామని చెప్పారు. జిల్లా కేంద్రం విజయనగరంలో తీవ్రమైన లోఓల్టేజ్ సమస్య ఉన్నా గత ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే అతిథి గజపతిరాజుతో కలిసి చంద్రబాబు దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లి రూ.180 కోట్లతో సబ్‌స్టేషన్ తీసుకువచ్చామన్నారు. గజపతినగరం నియోజకవర్గంలోని బొండపల్లి మండలంలో ఒక సబ్‌స్టేషన్‌తో పాటు నెల్లిమర్ల నియోజకవర్గంలో మరో రెండు సబ్‌స్టేషన్లు కూడా ఏర్పాటవుతుండడం కూటమి ప్రభుత్వ పాలనకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం జనసేన ఇన్‌చార్జ్ మర్రాపు సురేష్, ఎఎంసి చైర్మన్ గోపాలరాజు, గజపతినగరం టిడిపి మండల అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి, ఆంద్రా రిజర్వాయర్ ఛైర్మన్ కోడి సతీష్‌కుమార్, పిఎసిఎస్ లెంక బంగారునాయుడు, క్లస్టర్ నాయకులు ప్రదీప్‌కుమార్, గోవింద, నారాయణ అప్పల నాయుడు, తదితరులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణఅమరజీవి పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ కోసం చేసిన త్యాగం ఎప్పటికీ తెలుగు ప్రజల మదిలో ఉండిపోతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పాతబగ్గాం హైస్కూల్ ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసినందుకు జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులను మంత్రి అభినందించారు. రూ.73.60 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, డ్రైనేజ్‌లను కూడా మంత్రి ప్రారంభించారు.

# స్వీయ రక్షణకు కరాటే, బాక్సింగ్



**మాధవధార, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** స్వీయ ఆత్మరక్షణ కోసం కరాటే, బాక్సింగ్ వంటి క్రీడలలో శిక్షణ తీసుకోవాలని ప్రముఖ రియల్ వ్యాపార సంస్థ హైవే వెంచర్స్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ హేమారావు చింతాడ సూచించారు. విశాఖ వేదికగా స్థానిక బీచ్ రోడ్డులోని గోకుల్ పార్కు వద్ద విశాఖ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ (వికెఎ) పౌండర్ కె.సింగ్, ప్రెసిడెంట్ నీలాపు శ్రీను, జనరల్ సెక్రటరీ గనగళ్ల రాజేష్ ఆధ్వర్యంలో అఫిలేటెడ్ (ఎపి అమెచ్యూర్ కిక్ బాక్సింగ్, ఇండియన్ కిక్ బాక్సింగ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యాన మే 9,10 తేదీలలో జరగనున్న ఉత్తరాంధ్ర కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్-2026 పోటీల ట్రోఫీ, బ్రోచర్‌ను డాక్టర్ హేమా రావు చింతాడ ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారు లకు ప్రత్యేక ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. ఇటువంటి క్రీడలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీఇచ్చారు. వికెఎ జనరల్ సెక్రటరీ గనగళ్ల రాజేష్ మాట్లాడుతూ, సమాజ సేవాలో ముందుండే హైవే వెంచర్స్ అధినేత చేతులమీదుగా ట్రోఫీ ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు చింతాడ ఢిల్లీశ్వరరావు, సనపల చిన్నబాబు, అరవింద్ స్వామి, పోటీల నిర్వాహకులు సుధాకర్, సంతోష్, సురేంద్ర, యల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు

## - ఎస్పీ దామోదర్ - పోలీస్‌స్టేషన్ల ఆకస్మిక తనిఖీ



**బొబ్బిలి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** విజయనగరం జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు పోలీ సు యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తోందని ఎస్పీ ఏఆ ర్ దామోదర్ తెలిపారు. బొబ్బిలి పోలీసుస్టేషన్‌ను, రూ రల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన ఆదివారం సంద ర్శించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఒడిశా నుంచి గంజాయి రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. సంక ల్పం పేరుతో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమా లు చేపడుతున్నామని తెలిపారు. సీఐలు కింతలి నారా యణరావు, శ్రీనివాసరావు, ఎస్ఐ జ్ఞానప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలి కోట సందర్శన :** బొబ్బిలి కోటను ఎస్పీ ఏఆర్ దామోదర్ తమ కు టుంబ సభ్యులతో ఆదివారం సందర్శించారు. ఎమ్మెల్యే బేబీనాయన వారికి సాదరంగా స్వాగతం పలికారు. దర్బార్ మహల్‌ను, అక్కడ మ్యూజియంను ఎస్పీ ఆసక్తి గా తిలకించారు. ఆనాటి ఆయుధాలను, ఫొటోలకు సం బంధించి ఎమ్మెల్యే వారికి వివరించారు. అనంతరం బొబ్బిలి వీణను బహూకరించి సత్క రించారు. బొబ్బిలి కోటను సందర్శించిన అనంతరం ఎస్పీ స్పందిస్తూ అక్కడ రికార్డుల్లో తన అభిప్రాయాన్ని ఇలా నమోదు చేశారు. 'బొబ్బిలి కోట పౌరుషాలకు, ఆత్మాభిమానానికి ప్రతీక. అలాంటి కోటను దర్శించడం నా అదృష్టం. గొప్ప అవకాశం. బొబ్బిలి రాజులు ఉపయోగించిన ఆయుధాలు, వస్తువులు, వివిధ కాన్ఫరెన్స్‌ల్లో పాల్గొన్న ఫోటోలు మొదలగు వాటిని భద్రపరిచి ప్రజాదర్శనార్థం ఉంచిన నేటితరం బొబ్బిలి రాజుల ఆశయం చాలా గొప్పది. రియల్టీ ఇట్ ఈజ్ ఏ మార్వెలెస్ ఆన్‌ది ఎర్త్ ఆఫ్ విజయనగరం డిస్ట్రిక్ట్' అని ఎస్పీ రాశారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

**రామభద్రపురం :** జిల్లాలో సైబర్ క్రైం ఎక్కువవుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆదివారం తనిఖీ చేశా రు. సైబర్ క్రైంను నిరోధించడానికి జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేకమైన వ్యవస్థ ఏర్పాటు చేశామని, వారిపై నిఘా కూడా పెడుతున్నామని తెలిపారు. అలాగే బెట్టింగ్ రాయళ్లపై కూడా నిఘా పెట్టామని, బెట్టింగ్ నిర్వాహ కులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించా రు. ఈ సమావేశంలో బొబ్బిలి టౌన్ సీఐ కింతలి నా రాయణరావు, బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

**దత్తిరాజేరు :** మండలంలోని స్టేషన్ బూర్జవలస పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదివారం తని ఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదు దారులతో మర్యా దపూర్వకంగా నడుచుకోవాలన్నారు. సీఐ వెంకటర మణ, ఏఎస్ఐ రమణ పాల్గొన్నారు.

# సామాన్యుడి కోసం ఆలోచించిన మహనీయుడు అంబేద్కర్


## ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జయంతి వేడుకలు



**విశాఖపట్నం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** సామాన్య ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపించిన గొప్ప దార్శనికుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని అస్సాంలోని బీరంగన సతీ సాధని రాజ్యిక్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య జి.సింగయ్య కొనియాడారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాలలోని గౌతమ బుద్ధ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య సింగయ్య మాట్లాడుతూ ... అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, దేశాన్ని ప్రేమించిన గొప్ప దేశభక్తుడని పేర్కొన్నారు. నేటి యువత ప్రపంచంలో తాము ఎవరికీ తక్కువ కాదనే ఆత్మవిశ్వాసంతో ఎదగాలని పిలుపు నిచ్చారు. ఏయూ అంబేద్కర్ చైర్ గ్రామీణ ప్రజలకు చేరువయ్యేలా చేస్తున్న పనులను ఆయన అభినందించారు. మరో అతిథి, ఆచార్య నాగార్జున వర్సిటీ మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్ దాస్ మాట్లాడుతూ.... " ప్రతి వ్యక్తిలోనూ ఒక అంబేద్కర్ ఉంటారు " అని అభివర్ణించారు. సమాజ శ్రేయస్సు కోసం యువత బాధ్యతగా పని చేయాలని, గాంధీ సెంటర్, అంబేద్కర్ అధ్యయన కేంద్రాలు సమన్వయంతో పని చేయాలని ఆకాంక్షించారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ 'అంబేద్కర్ దార్శనికత--భారత రాజ్యాంగం' అనే అంశంపై ప్రసంగిస్తూ .... భారత రాజ్యాంగం ఎంతో దృఢమైనదని, దేశ అవసరాలకు అనుగుణంగా దీనిని అంబేద్కర్ రూపొందించారని తెలిపారు. ఆర్టికల్ 32ను రాజ్యాంగానికి ప్రధాన స్తంభంగా అభివర్ణించిన ఆయన, చట్టాలను గౌరవించే పౌరులుగా యువత తీర్చి దిద్దబడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సంచాలకులు ఆచార్య టి.శోభశ్రీ, డాక్టర్ తెన్నేటి జయరాం, డీన్ ఆచార్య టి.వి.కృష్ణ, ఆచార్య రత్నం మరియు పెద్ద సంఖ్యలో పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# అల్లు వారు అలా అన్నారో లేదో...






టాలీవుడ్ అగ్ర నిర్మాత అల్లు అరవింద్.. డెకాయిట్ సినిమా సక్సెస్ మీట్లో ఈ చిత్ర కథానాయిక మృణాల్ ఠాకూర్‌ను ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గతంలో తాను ఇక్కడి అబ్బాయిని పెళ్లి చేసుకోమని లావణ్య త్రిపాఠికి చెబితే, ఆమె వరుణ్‌తేజ్‌ను పెళ్లాడి హైదరాబాద్‌లో సెటిలైపోయిన విషయాన్ని గుర్తు చేసిన అరవింద్.. మృణాల్ కూడా ఇక్కడి అబ్బాయినే పెళ్లి చేసుకుని ఇక్కడే ఉండిపోవాలని ఆకాంక్షించారు. దీంతో మృణాల్ తెగ సిగ్గుపడిపోయింది. ఆడిటోరియం అంతా నవ్వులతో నిండిపోయింది. ఐతే అరవింద్ ఈ కామెంట్ చేసిన కాసేపటికే సోషల్ మీడియా జనాలు డ్యూటీ ఎక్కేశారు. లావణ్య.. వరుణ్‌తో ప్రేమలో ఉన్న విషయం తెలిసే అరవింద్ అప్పట్లో ఆ కామెంట్ చేశారని, ఇప్పుడు మృణాల్ కూడా ఇక్కడ ఓ అబ్బాయిని చూసుకుంది కాబట్టే ఆయన ఇలా మాట్లాడారని కథలు అల్లేశారు. అంతే కాక ఆ అబ్బాయి ఎవరో కూడా చెప్పేశారు. అక్కినేని ఫ్యామిలీకి చెందిన సుమంత్‌తో మృణాల్ ప్రేమలో ఉన్నట్లుగా పేర్కొంటూ వీళ్లిద్దరూ సన్నిహితంగా ఉన్న ఒక ఫొటోను షేర్ చేస్తున్నారు నెటిజన్లు. సుమంత్, మృణాల్ కలిసి సీతారామం సినిమాలో నటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఇద్దరూ ఎక్కడో ఒక ఫొటోకు పోజు ఇచ్చారు. ఆర్టిస్టులు కలిసి నటించినపుడు ఇలా ఫొటోలు దిగడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ సోషల్ మీడియా జనాలు మాత్రం ఇలా ఆలోచించడం లేదు. ఇద్దరికీ లింక్ పెట్టేశారు. కానీ డెకాయిట్ ప్రి రిలీజ్ ఈవెంట్లో మృణాల్.. సుమంత్‌ను అన్నా అని సంబోధించిన విషయాన్ని మరవకూడదు. అన్న అనే పదానికి అర్థం తెలియకుండానే ఆమె అలా అని ఉండదు. సుమంత్‌కు గతంలో హీరోయిన్ కీర్తి రెడ్డితో పెళ్లయింది. కొంత కాలానికే ఇద్దరూ విడిపోయారు. 20 ఏళ్లకు పైగా సుమంత్ సింగిల్‌గానే ఉంటున్నాడు. తనకు మళ్లీ పెళ్లి చేసుకునే ఉద్దేశమే ఉన్నట్లు కనిపించడం లేదు. పైగా సుమంత్‌కు 51 ఏళ్లు వచ్చేశాయి. మృణాల్ కంటే అతను చాలా పెద్దవాడు. వయసు 50 దాటినా, అమ్మాయితో వయసు అంతరం ఉన్నా పెళ్లి చేసుకోవడానికి అవేవీ అడ్డంకులు కాదు కానీ.. సుమంత్, మృణాల్ మధ్య ఎలాంటి వ్యక్తిగత బంధం లేదన్నది క్లియర్‌గా తెలుస్తున్నా.. ఇలా లింక్ పెట్టేయడం విచిత్రం.

# ప్యారడైజ్ గుమ్మడికాయ... రోమియో కొబ్బరికాయ





మార్చి నుంచి ఆగస్టుకి విడుదల తేదీ వాయిదా వేసుకున్న నాని ది ప్యారడైజ్ ఖచ్చితంగా చెప్పిన డేట్ కి విడుదలవుతుందా లేదానే అనుమానాలు ఇండస్ట్రీలో కొనసాగుతూనే ఉన్నాయి. నిన్న వదిలిన హీరోయిన్ కయదు లోహర్ బర్త్ డే పోస్టర్లో మరోసారి తేదీని స్పష్టంగా పేర్కొన్నారు కానీ కేవలం వీటిని బట్టే మాట మీద ఉంటారన్న గ్యారెంటీ అయితే లేదు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నాని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఆగస్ట్ 21 వదులుకునేందుకు సిద్ధంగా లేరు. ఇప్పటికైతే ఎలాంటి మార్పు లేదని క్లారిటీ వచ్చింది కాబట్టి అభిమానులు రిలాక్స్ అవ్వొచ్చు. అలాని కన్ఫర్మ్ గా చెప్పలేని పరిస్థితి కూడా గమనించాలి. మళ్ళీ ఏ మాత్రం లేట్ అయినా దాని ప్రభావం నేరుగా బ్లడీ రోమియో మీద పడుతుంది. ఎందుకంటే దర్శకుడు సుజీత్ ఆల్రెడీ స్క్రిప్ట్ సిద్ధం చేసుకుని ఉన్నాడు. క్యాస్టింగ్ కూడా పేపర్ మీద రెడీగా ఉంది కానీ నాని డేట్స్ అందుబాటులోకి వస్తేనే ఇతర ఆర్టిస్టుల కాల్ షీట్స్ తీసుకోవడానికి కుదురుతుంది. లేదంటే వృధా అవుతాయి. ప్యారడైజ్ కోసం జుత్తు గెడ్డం బాగా పెంచేసిన నాని వాటిని ఇప్పట్లో తీసేయలేడు. బ్లడీ రోమియో గ్యాంగ్ స్టర్ డ్రామా కాబట్టి దాని లుక్ పూర్తి డిఫరెంట్ గా ఉంటుంది. శ్రీకాంత్ ఓదెల గుమ్మడికాయ కొట్టేసి పంపిస్తే కానీ సుజిత్ కొబ్బరికాయ కొట్టలేడు. గతంలో అయితే నానికి ఈ సమస్య లేదు. ఒకే లుక్ తో ఒకే టైంలో రెండు సినిమాలు చేసేవాడు. కానీ ఇప్పుడు ప్యాన్ ఇండియా సబ్జెక్టులతో అలా కుదరడం లేదు. మేకోవర్ ప్రతిదానికి వేర్వేరుగా విభిన్నంగా ఉంటున్నాయి. ఒకేసారి వచ్చి క్లాష్ కు సిద్ధపడాలని ముందు అనుకున్న పెద్ది, ప్యారడైజ్ రెండూ ఒకే సమస్యని ఎదురుకుంటూ ఉండటం విచిత్రం. నిర్మాణం, పాటల చిత్రీకరణ, రాజీ లేని దర్శకుల మొండిపట్టు లాంటి కారణాల వల్ల ఫ్యాన్స్, ట్రేడ్ కోరుకున్న డేట్లకు ఇవి రాలేకపోతున్నాయి. నాని ప్యారడైజ్ కోసం ప్రాణాలు పెట్టేస్తున్నాడు. ఇప్పటిదాకా అందని ద్రాక్షలా ఊరిస్తున్న హిందీ మార్కెట్ దీని దెబ్బతో ఎక్కడికో తీసుకెళ్తుందని ధీమాగా ఉన్నాడు. ఫ్యాన్స్ నమ్మకం కూడా అదే.




## నందమూరి నాలుగో తరం సినిమా ఏమైంది?



టాలీవుడ్లో ఘన చరిత్ర ఉన్న నందమూరి కుటుంబం నుంచి ఇప్పటికే మూడు తరాల హీరోలు వచ్చారు. ఆ ఫ్యామిలీ నుంచి నాలుగో తరం హీరో ఎంట్రీ గురించి రెండేళ్ల ముందే అనౌన్స్‌మెంట్ వచ్చింది. హరికృష్ణ మనవడు, జానకి రామ్ తనయుడు అయిన నందమూరి తారక రామారావు (తన షార్ట్ నేమ్ కూడా ఎన్టీఆర్‌యే)ను సీనియర్ దర్శక నిర్మాత వైవీఎస్ చౌదరి హీరోగా పరిచయం చేయబోతున్నట్లు 2024లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా అనౌన్స్‌మెంట్ టైంలో కూడా వైవీఎస్ చాలా హంగామానే చేశారు. హీరో హీరోయిన్లకు సంబంధించి వేర్వేరుగా వీడియోలు రిలీజ్ చేశారు. సినిమా గురించి వరుసగా ప్రెస్ మీట్లు పెట్టి మీడియా దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నించారు. ఇది తెలుగుదనం ఉట్టిపడే సినిమా అని.. తెలుగు భాష, సంస్కృతి గురించి ప్రపంచానికి చెప్పే చిత్రమని ప్రకటించారు. కానీ ప్రారంభానికి ముందు ఇంత హడావుడి చేశారే కానీ.. ఆ తర్వాత సినిమా గురించి సౌండే లేదు. అసలు ఈ సినిమా సెట్స్ మీదికి వెళ్లిందా.. షూటింగ్ జరుగుతోందా.. చిత్రీకరణ ఏ దశలో ఉంది.. విడుదల ఎప్పుడు.. ఇలా ఏ సమాచారం బయటికి రావడం లేదు. ఏడాదిగా ఈ సినిమా అసలు వార్తల్లోనే లేదు. హీరో కొత్త వాడే అయినా.. నందమూరి లాంటి పెద్ద కుటుంబానికి చెందిన కుర్రాడు. కాబట్టి ఆ ఫ్యామిలీ బ్యాకప్ తనకు ఉంటుంది. తన అరంగేట్ర సినిమాను పట్టించుకోకుండా వదిలేసే అవకాశం లేదు. తమ సోదరుడి కొడుకు విషయంలో కళ్యాణ్ రామ్, జూనియర్ ఎన్టీఆర్ కూడా దృష్టిసారిస్తూనే ఉండొచ్చు. అయినా ఈ సినిమా ఊసులేవీ వినిపించకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయమే. ఐతే వైవీఎస్ ఒకప్పుడు హరికృష్ణకు పెద్ద బ్రేక్ ఇచ్చి ఉండొచ్చు.. రామ్‌ను హీరోగా నిలబెట్టి ఉండొచ్చు.. కానీ చాలా ఏళ్ల నుంచి ఆయన ఫామ్‌లో లేడు. చివరగా తీసిన రేయ్ సినిమా పరిస్థితి ఏంటో తెలిసిందే. ఇప్పుడున్న ఫామ్‌లో వైవీఎస్ బాక్సాఫీస్ దగ్గర ప్రభావం చూపించగలరా లేదా అనే ఆలోచనలో పడ్డట్టు వార్తలు వస్తున్నాయి. బహుశా ఆ కారణంతోనే సినిమాను హోల్డ్‌లో పెట్టేశారా అనే సందేహాలు కలుగుతున్నాయి. లేని పక్షంలో ఇంత కాలం వైవీఎస్ సైలెంటుగా ఉండే అవకాశం లేదు.



# బిజినెస్ న్యూస్



## ఓలా నుంచి కొత్త స్కూటర్.. సింగిల్ ఛార్జింగ్‌తో 320 km



ప్రముఖ విద్యుత్ వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ కొత్త స్కూటర్‌ను మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. సొంతంగా అభివృద్ధి చేసిన 4680 భారత్ సెల్‌తో తయారు చేసిన ఎస్1 ఎక్స్‌ం 5.2 kWh వేరియంట్‌ను (Ola S1 X+) సోమవారం విడుదల చేసింది. దీని ధరను రూ.1,29,999గా నిర్ణయించింది. ఇన్‌హౌస్‌లో రూపుదిద్దుకున్న సెల్ టెక్నాలజీ సాయంతో తయారు చేసిన స్కూటర్ కావడంతో అందుబాటు ధరలో తేవడం సాధ్యమైందని ఓలా ఎలక్ట్రిక్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఏప్రిల్ 15 వరకు ప్రారంభ ధర కింద రూ.1.29 లక్షలకు విక్రయించనున్నట్లు ఓలా తెలిపింది. ఇందులో 11kW మిడ్ డ్రైవ్ మోటార్‌ను అమర్చినట్లు వెల్లడించింది. సింగిల్ ఛార్జింగ్‌తో 320 కిలోమీటర్లు (IDC రేంజ్) ప్రయాణించొచ్చని పేర్కొంది. ఈ స్కూటర్ టాప్ స్పీడ్ గంటకు 125 కిలోమీటర్లు. బ్రేకింగ్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తూ బ్రేక్ బై వైర్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్ సదుపాయంతో తీసుకొచ్చినట్లు ఓలా వెల్లడించింది. ఓలా ఎలక్ట్రిక్ ఎస్1 ప్రో స్కూటర్లతో పాటు రోడ్‌స్టర్ విద్యుత్ మోటార్ సైకిళ్లను విక్రయిస్తోంది. ఎస్1 థర్డ్ జనరేషన్‌లో ఎస్1 ప్రోం (5.2kWh, 4kWh), ఎస్ 1ప్రో (4 kWh, 3kWh) పేరుతో ప్రీమియం స్కూటర్లను విక్రయిస్తోంది. మాస్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎస్1 ఎక్స్‌ం (4ఎెఔష్ట్ర), ఎస్ 1 ఎక్స్ (2, 3, 4 ఎెఔష్ట్ర) విక్రయిస్తోంది. రోడ్‌స్టర్ ఎక్స్‌ంను 4.5ఎెఔష్ట్ర, 9.1 ఎెఔష్ట్ర కాన్ఫిగరేషన్‌తోనూ, రోడ్‌స్టర్ ఎక్స్‌ను 2.5, 3.5, 4.5 kWh బ్యాటరీ సామర్థ్యంతోనూ విక్రయిస్తోంది. ఎస్1 ఎక్స్‌ం 5.2 ఎెఔష్ట్ర ఈ శ్రేణిలో కొత్తగా చేరింది.

## ఏళ్ల తరబడి ఉన్న యాప్‌ను నిలిపేసిన మైక్రోసాఫ్ట్

మే 25 నుంచి 'అవుట్‌లుక్ లైట్' సేవలు బంద్




టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తమ వినియోగదారులకు ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లలో తక్కువ డేటా, తక్కువ మెమరీతో పనిచేసేలా రూపొందించిన 'అవుట్‌లుక్ లైట్' యాప్ సేవలను నిలిపివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 2026, మే 25వ తేదీ నుంచి ఈ యాప్ పూర్తిగా పనిచేయడం ఆగిపోతుందని కంపెనీ స్పష్టం చేసింది.

ఏమిటీ మార్పు? ఎందుకు?

ఎంట్రీ లెవల్ స్మార్ట్‌ఫోన్లు, నెమ్మదిగా ఉండే ఇంటర్నెట్ కనెక్షన్లను దృష్టిలో ఉంచుకుని మైక్రోసాఫ్ట్ గతంలో ఈ 'లైట్' వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. అయితే, తన మొబైల్ ఈమెయిల్ వ్యూహాన్ని ఏకీకృతం చేయడంలో భాగంగా ఇకపై సింగిల్ ప్లాట్‌ఫామ్ పైనే దృష్టి సారించాలని కంపెనీ నిర్ణయించింది. మైక్రోసాఫ్ట్ 365 సేవలతో అనుసంధానం, మెరుగైన భద్రతా ఫీచర్లు, వ్యక్తిగత, కార్పొరేట్ వినియోగదారులకు విస్తృతమైన సౌకర్యాలను ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే 2025 చివరి నుంచే కొత్త డౌన్‌లోడ్లను నిలిపివేసిన కంపెనీ ఇప్పుడు తుది గడువును ఖరారు చేసింది. వినియోగదారులపై ప్రభావం ఇలా.. మే 25 తర్వాత మీ ఫోన్‌లో యాప్ ఐకాన్ కనిపించినప్పటికీ మెయిల్ బాక్స్ ఓపెన్ కాదు. అంటే, మీరు కొత్త ఈమెయిల్స్ చూడటం, పంపడం లేదా క్యాలెండర్ ఈవెంట్లను నిర్వహించడం సాధ్యం కాదు. అయితే, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ ఈమెయిల్స్, కాంటాక్ట్స్, క్యాలెండర్ డేటా అంతా సురక్షితంగా ఉంటుంది. యూజర్లు వెంటనే గూగుల్ ప్లే స్టోర్ నుంచి ప్రధాన 'అవుట్‌లుక్ మొబైల్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ఇప్పుడేం చేయాలి?

అంతరాయం లేని అవుట్‌లుక్ సర్వీసుల కోసం వినియోగదారులు గడువు ముగిసేలోపే కొన్ని చర్యలు తీసుకోవాలని కంపెనీ సూచించింది. అవుట్‌లుక్ లైట్ యాప్‌లోనే అప్‌గ్రేడ్ ఆప్షన్ కనిపిస్తుంది. దాని ద్వారా నేరుగా మెయిన్ యాప్‌కు వెళ్లవచ్చు. మెయిన్ అవుట్‌లుక్ యాప్ ఇన్‌స్టాల్ చేసిన తర్వాత మీ పాత మైక్రోసాఫ్ట్ అకౌంట్ వివరాలతో లాగిన్ అయితే సరిపోతుంది. మీ మెయిల్స్, అటాచ్‌మెంట్లు ఆటోమేటిక్‌గా సింక్ అవుతాయి. కంపెనీ ఐటీ నిర్వాహకులు ప్రత్యేకంగా ఏమీ చేయనవసరం లేదు కానీ, తమ ఉద్యోగులు సకాలంలో కొత్త యాప్‌కు మారేలా అంతర్గత మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉంటుంది. సాంకేతికత సర్వీసులు వేగంగా మారుతున్న తరుణంలో ఫీచర్ రిచ్ ప్లాట్‌ఫామ్‌ల వైపు మొగ్గు చూపడం ద్వారా యూజర్లకు అత్యుత్తమ సేవలు అందించడమే లక్ష్యమని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. కాబట్టి, గడువు ముగిసే వరకు వేచి చూడకుండా ఇప్పుడే మెయిన్ యాప్‌కు మారడం ఉత్తమం.

# నష్టాలతో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఇరాన్-అమెరికా మధ్య చర్చలు విఫలం కావడం, హర్మూజ్ దిగ్బంధనానికి ట్రంప్ ఆదేశాలు ఇవ్వడం వంటి కారణాలతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీనికితోడు చమురు ధరలు పెరగడమూ ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో పీఎస్‌యూ బ్యాంక్స్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. అయితే, సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లు నష్టపోగా.. తర్వాత కాస్త కోలుకుని 700 పాయింట్ల నష్టానికే పరిమితం కావడం ఊరటనిచ్చే అంశం. సెన్సెక్స్ ఉదయం 75,937.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,550.25) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,868.32 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 702.57 పాయింట్ల నష్టంతో 76,847.57 వద్ద ముగిసింది. నిఫ్టీ 207.95 పాయింట్ల నష్టంతో 23,842.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 56 పైసలు బలహీనపడి 93.39గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్ స్టాక్స్ మాత్రమే లాభపడ్డాయి. మారుతీ సుజుకీ, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్, టీసీఎస్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 102 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4717 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

స్టాక్ మార్కెట్ నష్టాలకు కారణాలు ఇవే..

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు విఫలం కావడంతో హర్మూజ్‌ను దిగ్బంధించాలని తమ నౌకాదళాన్ని ఆదేశించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ పరిణామాలు సెంటిమెంట్ దెబ్బతీశాయి.

ఇటీవల కాస్త తగ్గిన చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు ఏడు శాతం పెరిగి 102 డాలర్లకు చేరింది.

ఇటీవల కాస్త కోలుకున్నట్లు కనిపించిన రూపాయి మరోసారి పతనం కావడం, ఆసియా పసిఫిక్ మార్కెట్లు నష్టాల ప్రభావం మన సూచీలపై పడింది.

## రెడ్‌మీ నుంచి ఎంట్రీ లెవల్ 5జీ స్మార్ట్‌ఫోన్




ఎంట్రీ లెవల్ స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారి కోసం షావోమీ సంస్థ రెడ్‌మీ ఏ7 ప్రో 5జీ (=వఎఎఅ ూ7 ాతీశీ) మొబైల్‌ను లాంచ్ చేసింది. ఇప్పటికే గ్లోబల్ మార్కెట్‌లో ఎంట్రీ ఇచ్చిన ఈ ఫోన్.. భారత్‌లో సోమవారం విడుదలైంది. 6,300 ఎంఏహెచ్ బ్యాటరీ, 32 ఎంపీ డ్యూయల్ కెమెరాతో ఈ ఫోన్ వస్తోంది. ఫీచర్లు, ధర వివరాలు ఇప్పుడు చూద్దాం..

రెడ్‌మీ ఏ7 ప్రో ఫీచర్లు ఇవే..

6.9 అంగుళాల హెచ్‌డీం ఎల్‌సీడీ స్క్రీన్

ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్‌ఓఎస్3

నాలుగేళ్ల ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్

ఆక్టాకోర్ యూనిసోక్ టీ8300 ప్రాసెసర్

జెమినై, గూగుల్ సర్కిల్ టు సెర్చ్ ఏఐ ఫీచర్లు

32 ఎంపీ ప్రధాన కెమెరా

ముందు వైపు 8 ఎంపీ కెమెరా

వైఫై 5, బ్లూటూత్ 5.4, యూఎస్‌బీ టైప్-సి పోర్ట్, ఐపీ52 రేటింగ్


6300 ఎంఏహెచ్ బ్యాటరీ, 15ఔ వైర్డ్ ఛార్జింగ్

రివర్స్ వైర్డ్ ఛార్జింగ్ సదుపాయం

ధర: 4జీబీం 64జీబీ= రూ.11,499

4జీబీం 128జీబీ= రూ.12,499

# హజ్ యాత్ర వేళ ...
# మక్కా ప్రవేశంపై సౌదీ అరేబియా ఆంక్షలు



సౌదీ అరేబియా : హజ్ యాత్ర సీజన్ ప్రారంభమవుతున్న వేళ .... మక్కా నగర ప్రవేశంపై సౌదీ అరేబియా ప్రభుత్వం కీలక ఆంక్షలు విధించింది. ఈరోజు (ఏప్రిల్ 13) నుండి అధికారిక అనుమతి పత్రాలు లేని విదేశీయులు, స్థానిక నివాసితులు ఎవరూ మక్కాలోకి ప్రవేశించకూడదని స్పష్టం చేసింది. యాత్రికుల రద్దీని క్రమబద్ధీకరించడం, భద్రతను పర్యవేక్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ వెల్లడించింది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ....**

కేవలం మక్కాలో పని చేసే వర్క్ పర్మిట్ ఉన్నవారు, అక్కడ జారీ చేసిన రెసిడెన్సీ ఐడీ (ఇఖామా) కలిగిన వారు లేదా చెల్లుబాటు అయ్యే హజ్ పర్మిట్ ఉన్నవారిని మాత్రమే నగరంలోకి అనుమతిస్తారు. నిబంధనలను ఉల్లంఘించి వచ్చే వారిని సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్దే నిలిపివేసి వెనక్కి పంపేలా కఠిన చర్యలు చేపట్టారు.

**ఉమ్రా వీసాలపై వచ్చినవారికి 18 వరకు గడువు ....**

మరోవైపు ఉమ్రా వీసాలపై వచ్చిన విదేశీయులకు ఏప్రిల్ 18 వరకు మాత్రమే గడువు విధించారు. ఈ లోపు వారు దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే ఏప్రిల్ 18 నుండి మే 31 వరకు 'నుసుక్' ప్లాట్‌ఫారమ్ ద్వారా పౌరులు, జీసీసీ దేశాల వారికి ఇచ్చే ఉమ్రా పర్మిట్ల జారీని పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఏప్రిల్ 18 తర్వాత కేవలం హజ్ వీసా ఉన్న వారిని మాత్రమే మక్కాలోకి అనుమతించనున్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని సౌదీ ప్రభుత్వం హెచ్చరించింది. పవిత్ర హజ్ యాత్రను ప్రశాంతంగా, క్రమ శిక్షణతో నిర్వహించేందుకు యాత్రికులందరూ సహకరించాలని కోరింది.

## మా జోలికొస్తే.. పర్షియన్ గల్ఫ్ రేవులను దిగ్బంధిస్తాం: ఇరాన్ హెచ్చరిక




హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ చేసిన ప్రకటనపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ జలాల్లో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించడం 'సముద్రపు దొంగతనం'తో సమానమని ఐఆర్‌జీసీ పేర్కొంది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే పర్షియన్ గల్ఫ్ ప్రాంతమంతటా సముద్ర భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించింది. అమెరికా తమ రేవులను దిగ్బంధిస్తే.. తాము గల్ఫ్ రేవులను మూసివేస్తామనింది. భద్రత ఉంటే అందరికీ ఉండాలని.. లేకపోతే ఎవరికీ ఉండకూడదని ఐఆర్‌జీసీ పేర్కొంది. హర్మూజ్ జలాల్లో భద్రతను పర్యవేక్షిస్తామని ఐఆర్ జీసీ పేర్కొంది.

తమ ఓడరేవులకు ముప్పు కలిగితే ఈ ప్రాంతంలో ఏ ఓడరేవూ సురక్షితంగా ఉండదని వెల్లడించింది.

శత్రు దేశాల నౌకలను జలసంధి గుండా వెళ్ళడానికి అనుమతిం చబోమని స్పష్టం చేసింది. ఇరాన్ అనుమతి పొందిన నౌకలకు మాత్రమే హర్మూజ్‌లోకి ప్రవేశించే వీలు కల్పిస్తామంది. హర్మూజ్‌పై నియంత్రణ కొనసాగించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.

# ఢిల్లీ లిక్కర్ కేసు..
# హైకోర్టులో స్వయంగా వాదనలు వినిపించిన కేజ్రీవాల్



న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణనుంచి జస్టిస్ స్వర్ణకాంత శర్మను తొలగించాలని కోరుతూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హైకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సోమవారం హైకోర్టు పిటిషన్‌పై విచారణ జరిపింది. కేజ్రీవాల్ స్వయంగా తన వాదనలు వినిపించారు. విచారణ ప్రక్రియలో పక్షపాతం ఉండవచ్చంటూ ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా సాక్షుల వాంగ్మూలాలపై చేసిన వ్యాఖ్యలు తనను దోషిగా, అవినీతిపరుడిగా చిత్రీకరించేలా ఉన్నాయని కేజ్రీవాల్ కోర్టుకు తెలిపారు. దర్యాప్తు సంస్థలపై కూడా కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి దర్యాప్తు సంస్థలు మొదట సాక్షులను అరెస్టు చేసి.. ఆ తర్వాత ఇతరులను ఇరికించేలా వారి నుండి బలవంతంగా వాంగ్మూలాలను తీసుకుంటున్నాయని అన్నారు. కాగా, ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో కేజ్రీవాల్‌ను రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టరేట్ హైకోర్టులో సవాలు చేసింది. ఈడీ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఏప్రిల్ 6వ తేదీన విచారణ జరిపింది. ఈ సందర్భంగా, కేజ్రీవాల్ సహా పలువురు దాఖలు చేసిన రెక్యూసల్ పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని సీబీఐకి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

## పవన్ ఖేడా ట్రాన్సిట్ బెయిలుపై సుప్రీంకోర్టుకు అసోం ప్రభుత్వం



న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా (ఞఖుఞఅ ఖష్ట్రవతీఖ)కు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన వారం రోజుల ట్రాన్సిట్ బెయిలుపై అస్సాం ప్రభుత్వం సుప్రీంకోర్టును సోమవారంనాడు ఆశ్రయించింది. ట్రాన్సిట్ బెయిలు నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ వేసింది. సీజేఐ సూర్యకాంత్ బుధవారం లోపు దీనిపై విచారణ చేపట్టే అవకాశం ఉంది. అస్సాంలో నమోదైన కేసుకు సంబంధించి పవన్ ఖేడాకు తెలంగాణ హైకోర్టు ఏప్రిల్ 7న తాత్కాలిక బెయిలు మంజూరు చేసింది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ భార్య రిణికి శర్మకు మూడు విదేశీ పాస్‌పోర్టులు, విదేశాల్లో ఆస్తులు ఉన్నాయని, ఈ వివరాలను అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో సీఎం దాచిపెట్టారని పవన్ ఖేడా ఇటీవల సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను తోసిపుచ్చిన రిణికి శర్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది. అసోం పోలీసుల బృందం ఇటీవల న్యూఢిల్లీలోని పవన్ ఖేడా నివాసానికి వెళ్లినప్పటికీ ఆయన అక్కడ లేకపోవడంతో వెనుదిరిగింది. ఈ కేసులో అరెస్టుకు అవకాశం ఉందనే కారణంగా ముందస్తు బెయిలు కోసం తెలంగాణ హైకోర్టులో పవన్ ఖేడా పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌లో తన నివాసం హైదరాబాద్‌లో ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. పోలీసు చర్యకు అవకాశం ఉన్నందున తనకు లీగల్ ప్రొటక్షన్ కల్పించాలని కోర్టును కోరారు. దీంతో పవన్ ఖేడా సంబంధిత కోర్టులో పిటిషన్ వేసేందుకు వీలుకల్పిస్తూ వారం రోజుల ట్రాన్సిట్ బెయిలును హైకోర్టు మంజూరు చేసింది.

## తొలిసారి ఆస్ట్రేలియా 'డిఫెన్స్ చీఫ్'గా మహిళ



సిడ్నీ: ఆస్ట్రేలియన్ డిఫెన్స్ ఫోర్స్ చరిత్రలో తొలిసారిగా ఒక మహిళను ఆర్మీ చీఫ్‌గా నియమించారు. ప్రస్తుతం జాయింట్ క్యాపబిలిటీస్ విభాగాధిపతిగా ఉన్న లెఫ్టినెంట్ జనరల్ సూసన్ కోయిల్ జూలైలో ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. లెఫ్టినెంట్ జనరల్ సైమన్ స్టీవార్ట్ స్థానంలో సూసన్ నియమితులవుతారు. దేశ సైనిక చరిత్రలో ఇంతటి ఉన్నత పదవికి ఒక మహిళా అధికారిని ఎంపిక చేయడం ఇదే మొదటిసారి. ఈ నిర్ణయం రక్షణ రంగంలో లింగ సమానత్వానికి, దళాల ఆధునీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆస్ట్రేలియన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. సైన్యంలోని కమాండ్ మరియు కంట్రోల్ విభాగాలలో ఆమెకున్న సుదీర్ఘ అనుభవం, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో ఆమెకున్న నైపుణ్యం కారణంగా సూసన్ కోయిల్‌ను ఈ పదవికి నియమించారు. సైన్యంలోని అన్ని స్థాయి లలో మహిళలకు అధిక ప్రాతినిధ్యం కల్పించే లక్ష్యంతో ఆస్ట్రేలియన్ డిఫెన్స్ ఫోర్స్ అమలు చేస్తున్న సంస్కరణలలో ఈ నియామకం ఒక భాగం. ఆస్ట్రేలియన్ డిఫెన్స్ ఫోర్స్ లైంగిక వేధింపులు, వివక్షకు సంబంధించిన అనేక ఆరోపణలను ఎదుర్కొంటోంది. ఒక మహిళ దళాధిపతి పదవికి పదోన్నతి పొందుతున్న తరుణంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. సూసన్ నియామకాన్ని ఒక "చారిత్రాత్మక ఘట్టం"గా రక్షణ మంత్రి రిచర్డ్ మాలెస్ అభివర్ణించారు. 1987లో దళంలో చేరిన 55 ఏళ్ల సూసన్ కోయిల్, అనేక ఉన్నత కమాండ్ పదవులను నిర్వహించారు. ఆస్ట్రేలియా సైనిక దళాల (సైన్యం, నావికాదళం మరియు వైమానిక దళం) ఏ విభాగానికైనా నాయకత్వం వహించిన తొలి మహిళ సుసాన్ అవుతారని మాలెస్ అన్నారు. 2030 నాటికి దళంలో మహిళల నిష్పత్తిని 25 శాతానికి పెంచాలని ఆస్ట్రేలియా రక్షణ దళం లక్ష్యంగా పెట్టుకుంది.

# బాణసంచా కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం...

హైదరాబాద్: విరుద్‌నగర్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సాత్తూర్ సమీపం మడతుపట్టిలోని ఎక్సెల్ ఫైర్‌వర్క్స్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించింది. మందుగుండు సామగ్రి పేలడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో బాణసంచా కేంద్రంలో 60 మంది కార్మికులు ఉన్నట్టు సమాచారం. పలువురికి తీవ్రగాయాలు కాగా.. చాలా మంది కార్మికులు లోపలే ఉన్నట్లు తెలుస్తోంది. కార్మికుల సమాచారం మేరకు పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక కార్యక్రమాలు ముమ్మరం చేశారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎవరైనా మృతిచెందారా అనే విషయం ఇంకా తెలియరాలేదు.



## ఇరాన్‌పై మళ్లీ దాడులు.. సిద్ధమవుతోన్న ట్రంప్, ఇజ్రాయెల్..!



అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా? లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్‌ను నలువైపులా నిర్బంధించి, హర్మూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై అమెరికా అధ్యక్షుడు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురుచూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది.

**ఒప్పందానికి కొన్ని అంగుళాల దూరంలో..**

ఇదిలా ఉండగా.. శాంతి చర్చలు విఫలమవడానికి అమెరికానే కారణమని ఇరాన్ ఆరోపించింది. "47 ఏళ్లలోనే ఈ రెండు దేశాల మధ్య జరిగిన అత్యున్నత స్థాయిలో చర్చల్లో.. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో ఇరాన్ చిత్తశుద్ధితో సంప్రదింపులు చేసింది. కానీ, ఇస్లామాబాద్ ఒప్పందానికి కొన్ని అంగుళాల దూరంలోనే చర్చలు కుప్పకూలాయి. అతివాద భావజాలం, లక్ష్యాలు మారడం, నిర్బంధం వంటివి మాకు ఎదురయ్యాయి. మంచి చేస్తే మంచి జరుగుతుంది. చెడు చేయాలని చూస్తే శత్రుత్వమే మిగులుతుంది" అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పోస్ట్ చేశారు.

# లాలూకు సుప్రీంలో చుక్కెదురు...
# వ్యక్తిగత హాజరు నుంచి మాత్రం మినహాయింపు



న్యూఢిల్లీ: భూములు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారనే కేసులో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ (ఞుశ్రీబ ౹ాతీఖుఖు ఖుఞుజ)కు సుప్రీంకోరులో నిరాశ ఎదురైంది. తనపై, తన కుటుంబ సభ్యులపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారంనాడు తోసిపుచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటేశ్వర సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కేసులో మెరిట్స్‌ను పరిశీలించే అధికారాన్ని ట్రయిల్ కోర్టుకే విడిచిపెడుతూ, చట్టప్రకారం విచారణ కొనసాగించవచ్చని ధర్మాసనం పేర్కొంది. అయితే ట్రయల్ కోర్టు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి లాలూకు మినహాయింపు ఇచ్చింది. ఈ కేసులో ఇంతకుముందు లాలూ ప్రసాద్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తలిగింది. సీబీఐ తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. ఈ నిర్ణయాన్ని లాలూ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపైనే సుప్రీం తాజా తీర్పు చెప్పింది. లాలూ ప్రసాద్ యాదవ్ 2004-2009 మధ్య కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో రైల్వేలోని వివిధ జోన్లలో అనేక మందిని గ్రూప్-డి పోస్టుల్లో నియమించారు.

దీనికి బదులుగా వారి భూములను లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు ఒక ప్రైవేటు కంపెనీకి బదిలీ చేశారని సీబీఐ ఆరోపణగా ఉంది. 2022 మే 18న లాలూ, ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు, గుర్తుతెలియని ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు వ్యక్తులపై కేసు నమోదైంది.

77 ఏళ్ల లాలూ, ఇతర నిందితులు ప్రస్తుతం బెయిలుపై ఉన్నారు. కాగా, సీబీఐ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ఇన్వెస్టిగేషన్, చార్జిషీట్లలో చట్టపరమైన లోపాలు న్నాయని లాలూ వాదనగా ఉంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 17ఏ కింద సీబీఐ ముందస్తు అనుమతి తీసుకోలేదని, ఇందువల్ల సీబీఐ ప్రొసీడింగ్స్ చెల్లనేరవని లాలూ వాదించారు. అయితే ఈ వాదనను తాజాగా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీంతో ఈ కేసులో లాలూ కుటుంబానికి న్యాయపరంగా మరిన్ని చిక్కులు తప్పేలాలేవు.

## ట్రంప్‌ను పదవి నుంచి తొలగించాల్సిందే: మాజీ సీఐఏ చీఫ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదుపు తప్పిపోయారని అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థ సీఐఏ మాజీ చీఫ్ జాన్ బ్రెన్నన్ అన్నారు. ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలని సూచించారు. ఇందుకోసం యూఎస్ రాజ్యాంగంలోని 25వ అమెండ్‌మెంట్‌ను (రాజ్యాంగ సవరణ) ఉపయో గించుకోవాలని కూడా సూచించారు. ఇటీవల ఒక అమెరికా మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా త్రివిధ దళాలకు అధిపతిగా ట్రంప్ మరింత కాలం పాటు పదవిలో కొనసాగితే ప్రజలకు ముప్పు తప్పదని హెచ్చరించారు. నాగరికతను అంతం చేస్తామన్న ట్రంప్ వార్నింగ్ ఇందుకు నిదర్శనమని చెప్పారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం, అధ్యక్షుడు మరణిం చినా, రాజీనామా చేసినా లేక అభిశంసనకు గురైనా ఆ బాధ్యతలను తాత్కాలికంగా వైస్‌ప్రెసిడెంట్ చేపట్టాల్సి ఉంటుంది.



### సిమెంట్ మిక్సర్ వెహికల్‌ను ఢీకొన్న ఈకో వ్యాన్ : 11 మంది మృతి

ముంబయి : మహారాష్ట్రలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న ఒక సిమెంట్ మిక్సర్ వాహనాన్ని ప్రయాణికులతో వెళ్తున్న ఈకో వ్యాన్ ఢీకొట్టింది. థానే జిల్లాలో కళ్యాణ్- అహల్యానగర్ హైవేపై జరిగిన ఈ ఘటనలో 11 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం ఉదయం 11.15 గంటల సమయంలో చోటుచేసుకుంది. ఈకో వాహనం ముర్బాద్‌వాసులను కళ్యాణ్‌కు తీసుకువెళుతోంది. గోవిలి గ్రామ సమీపంలోని రైతా బ్రిడ్జి దాటుతుండగా ఆ వాహనం ఎదురుగా వస్తున్న సిమెంట్ మిక్సర్‌ను ఈకో వాహనం ఢకట్టింది. దీంతో అక్కడికక్కడే 11 మంది మృతి చెందారు. ఒక వృద్ధ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రాణాలతో బయటపడ్డారు.

# అంగరంగ వైభవంగా అప్పన్నకు తొలి విడత చందనము అరగదీత ప్రారంభం

**- చందనోత్సవం రోజు రాత్రికి తొలి విడత మూడు మనుగుల చందన సమర్పణ**
**- ఉత్సవాల్లో పాల్గొనడం పూర్వజన్మ సుకృతం గంట్ల**



**తొలి విడత చందనం అరగదీత ప్రారంభం**

చందనోత్సవం రోజు రాత్రికి భక్తులు దర్శనాలు అనంతరం తొలివిడతగా సింహాద్రినాథుడుకి మూడు మనుగులు చందనాన్ని వైభవంగా సమర్పించ నున్నారు.. దీంతో సోమవారం వైశాఖ మాసం ఏకాదశి పర్వదిన సందర్భంగా తెల్లవారుజామున ప్రత్యేక పూజలు అనంతరం తొలి విడతగా చందనం అరగదీత కార్యక్రమం ప్రారంభించారు.. ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసచార్యులు.. కరి సీతారామాచార్యులు.. స్థానా చార్యులు టి పి రాజగోపాల్ ఆలయ ఈవో జే వెంకట్రావు ఏ ఈ ఓ తిరుమ లేశ్వరరావు.. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు.. ప్రత్యేక ఆహ్వానితులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తదితరులు చందనము అరగదీత కార్యక్రమంలో పాల్గొన్నారు.. తొలుత అర్చక వర్గాలు చందనం అరగదీత. .ప్రారంభించారు..అత్యంత మహిమాన్వితమైన సింహాద్రినాథుడి ఉత్సవాల్లో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు చెప్పారు

**సింహాచలం ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్):** ప్రపంచంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈనెల 20న సింహాద్రి నాథుడు చందనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించ నున్నారు.. ప్రతి ఏటా వైశాక శుద్ధ తదియనాడు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవాన్ని ఈ ఏడాది కూడా అత్యంత ప్రతిష్టాత్మకముగా నిర్వహించనున్నారు.. ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను ఆలయ ఈవో జే వెంకటరావు ఆధ్వర్యంలో శరవేగంగా పూర్తి చేస్తున్నారు

# సింహగిరిపై చందనోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన హోం మంత్రి అనిత

- పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు ఆలయం వద్ద సిద్ధంగా ఉండాలి
- సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ
- ఈ సంవత్సరం దాదాపు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం..హోం మంత్రి అనిత.



చందనోత్సవం సందర్భంగా భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అదేవిధంగా ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను ఆలయం వద్ద సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ నిర్వహించ డంతో పాటు, ఆధునిక ఏఐ టెక్నాలజీని వినియోగించా లన్నారు. భక్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు విస్తృతంగా పంపిణీ చేయాలని సూచించారు. ఈ ఏర్పాట్లు పరిశీలనలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంక బ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, సింహాచలం ఆలయ ఈవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, చందనోత్సవం ఒక అపురూపమైన ఘట్టమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భక్తులు స్వామివారి నిజరూప దర్శనం కోసం వస్తారని చెప్పారు. గత సంవత్సరం సుమారు 1.20 లక్షల మంది భక్తులు హాజరయ్యారని, ఈసారి దాదాపు 2 లక్షల మంది భక్తులు రానున్నారని అంచనా వేస్తున్నాం అని తెలిపారు. సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తెల్లవారు జామున 3 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయని, అంతరాలయ దర్శనం ఉదయం 5 గంటల వరకు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం 10 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు, తాగునీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పిస్తున్నాం అని మంత్రి వెల్లడించారు.

**సింహాచలం ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్):** ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆమెకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ నెల 20న జరగనున్న స్వామివారి చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో స్త్రీ శక్తి కార్యక్రమం



సూచించారు. అలాగే స్థానిక సచివాలయ సిబ్బంది జీ.గురునాధ రావు (వెల్ఫేర్ సెక్రటరీ ),కళ్యాణరావు (వెల్ఫేర్ సెక్రటరీ) కార్యక్రమంలో పాల్గొని మహిళలకు తగిన ప్రోత్సాహం లభించినప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తారు అనడం అతిశయోక్తి కాదు గడిచిన దశాబ్దంలో అన్ని రంగాల్లో మహిళలు ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ పై విధంగా తెలిపారు. అలాగే కళాశాల అధ్యాపకులు డాక్టర్.ఆర్ జయప్రకాష్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధి సమాజాభివృద్ధికి తోడ్పడు తుందని మహిళలు అన్ని అవకాశాలను అందిపిం చుకోవాలని సూచించారు.. అదేవిధంగా ఎం. నాగరాజు మాట్లాడుతూ మహిళా బిల్లు సాధించడంలో ఎదు ర్కొన్న సవాలను విపులంగా వివరిస్తూ ప్రతి రంగంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడు సామాజికంగా రాజకీయ పరంగా మహిళలు రాణించగలరని తెలిపారు. చివరగా విద్యార్థిని విద్యార్థులు విద్యతో పాటు విలువలు కూడా పాటిస్తూ మంచి పౌరులుగా ముందుకు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చివరిగా స్త్రీ శక్తి కార్యక్రమం లో భాగంగా ఉమన్ ఎంపవర్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలత ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

**భీమునిపట్నం ఏప్రిల్ 13 నేటి మనదేశమ్ :** నారీ శక్తివందన ఆదినీయంలో భాగంగా మహిళా సాధికారత సమాన హక్కులు మరియు స్వీయ రక్షణ పై అవగాహన కార్యక్రమం తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ .పి. శ్రీవాణి మాట్లాడుతూ మహిళల ప్రాధాన్యత సమాజంలోని వారి పాత్ర మరియు స్వాలంబన పై మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలి అని విద్యతో పాటుగా " నారీ శక్తి వందనాదినియంలో" భాగంగా చట్టసభల్లో వారి యొక్క ప్రాధాన్యత ఎక్కువగా ఉండే విధంగా మరియు నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో 102 వినతులు..

**- జివిఎంసి కమిషనరు కేతన్ గార్గ్**



అర్జీలను/ ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్ర దించి నిర్ణీత సమయంలో పరిష్కరిం చాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పిం చకుండా ఆయా సమస్య లను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారు లను కమిషనర్ ఆదేశించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందరు జోనల్ కమిషనర్లతో మాట్లాడుతూ ప్రతి జోనల్ కమిషనర్ ఒక నెలలో 10 సచివాలయాలను తప్పకుండా సందర్శించి అక్కడ ప్రజలకు అందిస్తున్న సేవలను, సంబంధిత అర్జీలను, సమస్యల పరిష్కా రాలను నిషితంగా పరిశీలించాలని కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు పి.నల్ల న్నయ్య, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డి.విజయ భారతి, ప్రధాన ఇంజనీర్ పీవీ సత్యనారాయణ రాజు,ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, సిసిపి ఏ.ప్రభాకర రావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్. శ్రీనివాసరావు, ఎడిహెచ్ వాసుకి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, ఆర్.ఎఫ్.ఒ కృపావరం, పర్యవేక్షక ఇంజనీర్లు, డీసీపీ లు, ఏసీపీ లు, యుసిడి-డి.పి.ఒ శాంతి కుమారి, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ ఎల్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



**విశాఖపట్నం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 102 వినతులు వచ్చాయని జివిఎంసి కమిషనరు కేతన్ గార్గ్ తెలిపారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరం లో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ లతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 102 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా మధురవాడ జోన్ కు 22, ఈస్ట్ జోన్ కు 11, వెస్ట్ జోన్ కు 02, నార్త్ జోనుకు 14, సౌత్ జోన్ కు 12, పెందుర్తి జోన్ కు 4, అగనంపూడి జోన్ కు 03, గాజువాక జోన్ కు 08, అనకాపల్లి జోన్ కు 03, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 23 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ ఁ అకౌంట్సు విభాగమునకు 15, రెవెన్యూ విభాగమునకు 08, ప్రజారోగ్య విభాగమునకు 03, పట్టణ ప్రణాళిక విభాగమునకు 56, ఇంజినీరింగు విభాగము నకు 14, యుసిడి విభాగమునకు 06 కలిపి మొత్తంగా 102 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న

# ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం లక్ష్యం

**- గర్భిణులు మరియు బాలింతల్లో పోషకాహార అవగాహన పెంచడం మన బాధ్యత**
**- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోషణపక్వాడ కార్యక్రమం**



**విశాఖపట్నం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్):** సమాజంలో ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించాలంటే తల్లి--శిశు సంక్షేమమే మూలాధారం అని గుర్తించిన కూటమి ప్రభుత్వం, పోషకాహార లోప నిర్మూలనపై దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే శ్రీ పల్లా శ్రీనివాసరావు గారు స్పష్టం చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పెందుర్తి పరిధిలో గాజువాకలో నిర్వహించిన పోషణపక్వాడ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ... గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని తగ్గించడం కేవలం ఆరోగ్య కార్యక్రమం మాత్రమే కాదు, అది రాష్ట్ర భవిష్యత్తును బలోపేతం చేసే సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. పోషణపక్వాడ కార్యక్రమాల ద్వారా ప్రతి అంగన్వాడీ కేంద్రం పరిధిలో తల్లులు, గర్భిణీలు, బాలింతలకు విస్తృత అవగాహన కల్పిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. గర్భధారణ నుంచి చిన్నారి రెండేళ్లు నిండే వరకు ఉన్న మొదటి 1000 రోజులు అత్యంత కీలకమని, ఈ దశలో తల్లి పోషణ, శిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు.

అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి కుటుంబానికి పోషకాహారం ప్రాముఖ్యతను చేరవేస్తున్నామని తెలిపారు. "పోషిత్ భారత్" లక్ష్యంతో జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించి, సాంప్రదాయ ఆహారాన్ని ప్రోత్సహించే దిశగా చైతన్యం కల్పిస్తున్నామని, ప్యాకెట్ ఆహారాల ప్రభావంపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నామని చెప్పారు.

అలాగే 3 నుంచి 6 సంవత్సరాల వయస్సులో పిల్లల మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని, ఈ దశలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని పల్లా పేర్కొన్నారు. పిల్లలతో మాట్లాడడం, ఆడించడం, కథలు చెప్పడం ద్వారా వారి అభివృద్ధికి బలమైన పునాది వేయాలని సూచించారు. కుటుంబ స్థాయిలోనే ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు పురుషుల భాగస్వామ్యాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ల ద్వారా "మొదటి 1000 రోజులు కీలకం", "జంక్ ఫుడ్‌కు బదులుగా ఇంటి వంటనే ఆరోగ్యానికి మార్గం", "పిల్లలతో గడిపే సమయమే వారి భవిష్యత్తు" వంటి సందేశాలను ప్రజలకు చేరవేశారు. ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో పోషణపక్వాడ కీలక పాత్ర పోషిస్తుందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోడీ కపట నాటకం

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శ**

**విశాఖపట్టణం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోడీ ప్రభుత్వం కపట నాటకం ఆడుతుందని సిపిఎం నేతలు మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ చర్చ చేస్తుందని ఆగ్రహించారు.

2023లోనే చట్టం అయినప్పుడే 2011 జనాభా లెక్కల ఆధారంగా చట్టాన్ని అమలు చేయాలని సిపిఎం కోరిందని తెలిపారు. అప్పుడు డిలిమిటేషన్, సీట్ల పెంపుదల, సెన్సస్ అయిన తరువాత అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం మాయమాటలు చెప్పిందని తెలిపారు. కానీ ఇప్పుడు అవేమి జరగకపోయినా మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ కోసం 3రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహించారు. బిల్లుకి మద్దతు ఇవ్వాలని ప్రధాని మోడీ రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు లేఖ రాయడం నాటమని తెలిపారు. రాష్ట్రాల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకోకుండా, కేంద్రం నిర్ణయాలను అమలు చేయాలని ఏకపక్ష వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు.

డిలిమిటేషన్ ను జనాభా ప్రాతిపదికన కాకుండా సీట్ల పెంపుదలను బట్టి అమలు చేయాలని అనేక రాష్ట్రాలు ప్రతిపాదించాయని తెలిపారు. డిలిమిటేషన్ తో సంబంధం తేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం పాల్గొన్నారు.

Edited, Printed, Published and owned by K.S. Ranga Sayi and published from 8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027 (A.P.) Printed at SKYLINE PRESS, D.N`•.8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027. (A.P) Ph: 0891-2531616, Email: netimanadesamvizag16@gmail.com